# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 221

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: ఆదివారం 13 సెప్టెంబర్ 2026








**ఢిల్లీ, సమయం ప్రతినిధి:** బ్రిక్స్ సదస్సులో చారిత్రక ఘట్టం నమోదైంది. సదస్సులో భాగంగా రూపొందించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్' కు కూటమిలోని సభ్య దేశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతున్న పశ్చిమాసియా సంక్షోభంపైనా సభ్య దేశాల మధ్య స్పష్టమైన ఏకాభిప్రాయం వ్యక్తమైంది.

**యుద్ధం పరిష్కారం కాదు – చర్చలే మార్గం**

పశ్చిమాసియా పరిణామాలపై బ్రిక్స్ కూటమి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఏ రకమైన సమస్యకూ యుద్ధం పరిష్కారం కాదని స్పష్టం చేసింది. శాంతిని నెలకొల్పడానికి నిరంతర చర్చలు, దౌత్య మార్గాలే ఏకైక పరిష్కారమని సభ్య దేశాలు తేల్చిచెప్పాయి.

'న్యూఢిల్లీ డిక్లరేషన్'లోని ముఖ్యాంశాలు

**పశ్చిమాసియా సంక్షోభం– శాంతి:** పశ్చిమాసియా సంక్షోభం సహా ఎలాంటి అంతర్జాతీయ సమస్యలకైనా యుద్ధం పరిష్కారం కాదని, దౌత్య మార్గాలు, చర్చల ద్వారానే శాంతి సాధ్యమని స్పష్టం చేశారు. ఏకపక్ష యుద్ధ చర్యలను ఖండిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**ప్రధాని మోదీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు**

సదస్సును ఉద్దేశించి భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, బ్రిక్స్ కూటమి ప్రయాణంలో ఇది కీలక ఘట్టమని పేర్కొన్నారు. బ్రిక్స్ కూటమి ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సభ్య దేశాల ప్రజలకు విశ్వాసం, భరోసా కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.




**సమయం ప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. ఈ సందర్భంగా హాజరవుతున్న అతిథుల కోసం జైపూర్‌కు చెందిన ప్రముఖ సంస్థ అరుణ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రత్యేక వెండి టేబుల్‌వేర్, కట్లరీని రూపొందించింది. ప్రాచీన భారతదేశంలో రాజులు, మహారాజుల విందుల్లో ఉపయోగించిన పాత్రలను గుర్తుచేసేలా రాజసం ఉట్టిపడే సంప్రదాయ డిజైన్లతో వీటిని తయారు చేశారు. భారతీయ, చైనీస్, రష్యన్ తదితర దేశాల వంటకాలను వడ్డించేందుకు అనువుగా దాదాపు 50 నుంచి 60 రకాల గిన్నెలు, ప్లేట్లు, స్పూన్లు, మూతలతో కూడిన కంటైనర్లను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ప్రతి పాత్రను ఎంతో నైపుణ్యంతో రూపొందించి, అందమైన కళాకృతులతో అలంకరించారు. ప్రతి వస్తువుకు మెరుగైన మెరుపు, నాణ్యత వచ్చేలా 10 దశల్లో కోటింగ్, ఫినిషింగ్ ప్రక్రియను నిర్వహించారు. భారతదేశానికి వచ్చే విశిష్ట అతిథులను దైవ సమానులుగా భావించే 'అతిథి దేవో భవ' సంప్రదాయాన్ని ఈ ప్రత్యేక వెండి పాత్రలు ప్రపంచ దేశాల నేతలకు చాటిచెబుతున్నాయి. భారతీయ ఆతిథ్య సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా వీటిని ప్రత్యేక డిజైన్లతో తయారు చేశారు. అరుణ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈవో అరుణ్ పబువాల్ మాట్లాడుతూ.. ప్రముఖుల కార్యక్రమాలకు తమ టేబుల్‌వేర్‌ను అందించడం ఇదే తొలిసారి కాదన్నారు. 2023లో జరిగిన జీ20 సదస్సుతో పాటు పలు వీఐపీ కార్యక్రమాలు, దేశానికి వచ్చిన అధ్యక్షుల పర్యటనల్లోనూ తమ ఉత్పత్తులను ఉపయోగించినట్లు తెలిపారు.




**సమయం ప్రతినిధి:** వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో భాగ్యనగరంలో పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించినట్లు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ప్రకటించారు. ఖైరతాబాద్ బడా గణేశ్ చుట్టూ పక్కల పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని.. భక్తులు పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. బడా గణేశ్‌ను దర్శించుకోవడానికి సుమారు ముప్పై లక్షల మంది భక్తులు వస్తారని తెలిపారు. లక్షలాది మంది భక్తులు వస్తారు కాబట్టి ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని చెప్పుకొచ్చారు. స్థానికంగా ఇక్కడ నివసించేవారికి కూడా కొన్ని ఇబ్బందులు ఉంటాయని వెల్లడించారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులు పోలీసుల సూచనలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు.

**ఖైరతాబాద్ బడా గణేశ్ వద్దకు చేరుకోవడానికి ముఖ్యంగా నాలుగు దారులివే..**

'ఖైరతాబాద్ బడా గణేశ్ వద్దకు చేరుకోవడానికి ముఖ్యంగా నాలుగు దారులు ఉంటాయి. మెట్రో వైపు నుంచి, ద్వారకా హోటల్ వైపు ఉండి, మింట్ కాంపౌండ్ వైపు నుంచి, బడా గణేశ్ వెనక ఉండే బస్తీ వైపు నుంచి ఖైరతాబాద్ వినాయకుడు వైపు వచ్చే మార్గాలు ఉంటాయి. మెట్రో వైపు నుంచి ఎక్కువ మంది భక్తులు ఖైరతాబాద్ వినాయకుడు వైపు వచ్చే అవకాశం ఉంది. బడే గణేశ్‌ను దర్శించుకోవాలనుకునేవారు మెట్రోలో ప్రయాణం చేయాలని, ఎంఎంటీఎస్ సేవలు వాడుకోవాలి. ఖైరతాబాద్ మీదుగా సుమారు 2200 ఆర్టీసీ బస్సు సర్వీస్‌లు అందుబాటులో ఉంటాయి.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి :** హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చేందుకు ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్ స్పష్టం చేశారు. శనివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. హైదరాబాద్ ఎమ్మెల్యేలతో సిటీ డెవలప్‌మెంట్‌పై సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై గత ముఖ్యమంత్రిని కోరిన ఆయన సమావేశం పెట్టలేదని పెదవి విరిచారు. సిటీ డెవలప్‌మెంట్‌లో ఎమ్మెల్యేలకు బాధ్యత ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.. ఎమ్మెల్యేలకే నియోజక వర్గ సమస్యలు తెలుస్తాయని అన్నారు. గ్లోబల్ సిటీ కావాలంటే ప్రతి డివిజన్ సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందన్నారు. సిటీలో రహదారులు చాలా వరకు డ్యామేజ్ ఉన్నాయని.. డ్రైనేజ్ సరిగా లేదు వాటి మీద కూడా దృష్టి పెట్టాల్సి ఉందని తెలిపారు. బస్తీల్లో సరఫరా అయ్యే మంచి నీటిలో డ్రైనేజ్ వాటర్ కలుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ మూడు కార్పొరేషన్లు చేస్తున్నారని.. కానీ మంచి డెవలప్‌మెంట్ కావల్సి ఉందని పేర్కొన్నారు. ఈ మూడు కార్పొరేషన్లపై చర్చ జరగాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు ఏళ్ళు పూర్తయిందని.. ఇంకా 15 నెలల సమయం ఉందని గుర్తు చేశారు. ఈ 15 నెలల్లో మూసీ డెవలప్‌మెంట్ అవుతుందా..? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఈ వర్క్ నిదానంగా జరుగుతుందని అన్నారు. నగరంలో దోమల బెడద విపరీతంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 20 శాతం ప్రాపర్టీ టాక్స్ పెంచి ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు విలువ ఉందో? లేదో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. గతంలో ఓ ఎమ్మెల్యే మీడియా ముందే అధికారులు విలువ ఇవ్వడం లేదని చెప్పారని గుర్తు చేశారు. అధికారులను రిక్వెస్ట్ చేసినా స్పందించడం లేదని ఎమ్మెల్యే రాజా సింగ్ వాపోయారు. పని చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ గ్లోబల్ సిటీ కావాలని చాలా ఏళ్లుగా ప్రజలు కోరుతున్నారని చెప్పారు. ప్రతి సారి గ్లోబల్ సిటీ అవుతుందని అంటున్నారు కానీ అది పేపర్ల వరకే పరిమితం అవుతుందని అసహనం వ్యక్తం చేశారు.

**కేసీఆర్ హయాంలో తెలంగాణలో పేదలకు అందాల్సిన ఆస్తులపై కన్నేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఆ భూములను కొల్లగొట్టేందుకు మాస్టర్ స్కెచ్ వేశారని విమర్శించారు. 22ఏ సంబంధిత భూముల సమస్యలపై అసెంబ్లీలో లఘు చర్చను మంత్రి పొంగులేటి ఈరోజు (శనివారం) ప్రారంభించారు. ఆ మాస్టర్ స్కెచ్‌లో భాగంగానే బీఆర్ఎస్ హయాంలో ధరణిని తీసుకువచ్చారని ఆరోపించారు.**




**హైదరాబాద్, సమయం ప్రతినిధి :** ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ధరణిని తీసుకువచ్చారని అన్నారు. కేసీఆర్ హయాంలో నలుగురు వ్యక్తులు నాలుగు గోడల మధ్య అర్థరాత్రి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ధరణి వచ్చాక పేదలు అనేక కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

**తెలంగాణ భూములను విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టారు..** ధరణి నిర్వహణ కాంట్రాక్ట్‌ను కూడా తమకు అనుకూలమైన సంస్థకే ఇచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. తెలంగాణ భూములను విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని ఆరోపించారు. తాకట్టు పెట్టిన భూములను మరో సంస్థకు బదిలీ చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ భూములను సొంత ఆస్తుల్లా ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్లు చేశారని అన్నారు. కేసీఆర్ హయాంలోని భూ అక్రమాలను ఒక్కొక్కటిగా తాము అసెంబ్లీ ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న నాయకులు.. మాజీ మంత్రులు.. ఎమ్మెల్యేలు కూడా ధరణిపై మాట్లాడారని చెప్పారు. ప్రభుత్వం మంచి చేస్తే మంచి చేయాలని.. కానీ విషం చిమ్మే సంస్కృతి సరికాదని పేర్కొన్నారు.

**పేదల భూములను దోచుకునేందుకే ధరణిని తీసుకొచ్చారు..** 'పేదల భూములను దోచుకునేందుకే ధరణిని తీసుకొచ్చారు. తప్పు చేసినవారు.. తల వంచుకుంటారని.. పాపం చేసినవారు పారిపోతారు. ఈరోజు శాసనసభ సాక్షిగా అదే అక్షరాలా నిజమైంది. ఈ భూములపై చర్చకు ముఖం చాటేయడం బీఆర్ఎస్ నేతలకు కొత్తేమీ కాదు. సభలో గందరగోళం సృష్టించి ఉద్దేశపూర్వకంగానే పారిపోయారు. కేసీఆర్ హయాంలో రెవెన్యూ శాఖలో భారీ స్కాం చేశారు. అడ్డగోలుగా నొక్కేసిన భూముల లెక్కలు చిన్నవి కాదు. బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోవచ్చు.. కానీ నాలుగు కోట్ల మంది ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత మా ప్రభుత్వంపై ఉంది. తెలంగాణ కోసం పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేశారు. యూపీఏ ప్రభుత్వం, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను ప్రజలు ఎన్నుకున్నారు. పేదలకు పూర్తి హక్కులు వస్తాయని ప్రజలు కలలు కన్నారని.. కానీ తెలంగాణను వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారు. వారి ఆస్తులు.. బంధువుల ఆస్తులు పెంచుకునేందుకే తెలంగాణను వాడుకున్నారు. భూముల విషయంలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగింది. రెవెన్యూ శాఖ మొత్తం అప్పటి ముఖ్యమంత్రి కన్నుసైగల్లోనే నడిచింది. రెండోసారి కూడా రెవెన్యూ శాఖను కేసీఆర్ తన వద్దే ఉంచుకున్నారు' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు.

**భూ రికార్డులు, హక్కుల విషయంలో పారదర్శకత అవసరం..** 'భారతీయ సంస్కృతిలో మట్టికి––మనిషికి విడదీయరాని బంధం ఉంది. భూమి కేవలం ఆస్తి కాదని.. రైతు చెమటకు ప్రతీక. కుటుంబ భవిష్యత్తుకు భూమే భరోసా.. ఆత్మగౌరవానికి నిలువెత్తు సాక్ష్యం. కష్టపడి కొనుగోలు చేసిన చిన్న స్థలమైనా.. పంట పొలమైనా ఎంతో విలువైనదే. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న భూములతో కుటుంబాల అనుబంధం ఉంది. భూమికి సంబంధించిన ప్రతి నిర్ణయం అత్యంత బాధ్యతతో ఉండాలి. భూ రికార్డులు, హక్కుల విషయంలో పారదర్శకత అవసరం.

## ప్రత్యేక సమగ్ర సవరణపై అధికారుల సమీక్ష




**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 12, సమయం ప్రతినిధి :** ఓటర్ల జాబితాను దోషరహితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (SIR-2026) ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పకడ్బందీగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. 76–దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్లు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు (AEROs), బూత్ స్థాయి అధికారులు (BLO) సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో SIR-2026 పురోగతిని ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల పరిశీలనను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు, మ్యాపింగ్ కాని ఓట్లు, ఇతర మార్పులకు సంబంధించి అవసరమైన నోటీసులను సంబంధిత ఓటర్లకు వెంటనే అందజేయాలని ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం–6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం–7, వివరాల మార్పులు, సవరణలకు ఫారం–8 ద్వారా వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం సకాలంలో పరిష్కరించాలని తహశీల్దార్లను ఆదేశించారు.

**ప్రత్యేక ప్రచార దినాల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలి**

సెప్టెంబర్ 12తో ప్రత్యేక ప్రచార దినాలు ముగిసిన నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో స్వీకరించిన దరఖాస్తులు, అభ్యర్థనలు, సవరణలను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు నిర్వహించిన పనులను సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తనిఖీ చేసి, క్రాస్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ హెచ్చరించారు.

**అర్హులంతా ఓటరు జాబితాను పరిశీలించుకోవాలి**

18 ఏళ్లు నిండిన అర్హులైన యువతతో పాటు ప్రతి ఓటరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని మధుసూదన్ నాయక్ కోరారు. వివరాల్లో తప్పులు లేదా మార్పులు ఉంటే సంబంధిత ఎన్నికల సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొత్త ఓటరు నమోదు, పేరు తొలగింపు, వివరాల సవరణకు ఫారం–6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. దోషరహిత, పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఓటర్లు కూడా తమ వివరాలను సరిచూసుకుని సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు.




**సమయం ప్రతినిధి :** సోషల్ మీడియాలో ప్రస్తుతం 1980ల రెట్రో ఫొటో ఎడిటింగ్ ట్రెండ్ వైరల్‌గా మారింది. చాలా మంది తమ ఫొటోలను 1980 దశకం నాటి ఫొటోలుగా మార్చుకుని సంబరపడిపోతున్నారు. అయితే, ఈ ట్రెండ్‌ను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సాధారణ ఫొటోలను 1980ల నాటి రెట్రో ఫొటోలుగా మార్చుతామంటూ సోషల్ మీడియా ప్రకటనలు, సందేశాల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను ఆకర్షిస్తున్నారని శిఖా గోయల్ తెలిపారు. ఉచితంగా లేదా అపరిమితంగా ఎడిటింగ్ సదుపాయం కల్పిస్తామంటూ నమ్మబలుకుతున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సైబర్ కేటుగాళ్లు పంపే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేస్తే ప్రమాదం తప్పదని ఆమె హెచ్చరించారు. అలాంటి లింకులను ఓపెన్ చేస్తే ఏపీకే ఫైళ్ల ద్వారా నిందితులు మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఎస్ఎంఎస్, ఓటీపీ, కాంటాక్టులు, బ్యాంకింగ్, ఆర్థిక, వ్యక్తిగత సమాచారం సహా మొబైల్‌లో భద్రపరిచిన ఇతర సున్నితమైన సమాచారాన్ని నిందితులు దొంగిలించే అవకాశం ఉందన్నారు. దీని ద్వారా ఆర్థిక మోసాలు, అనధికారిక లావాదేవీలు, గుర్తింపు దుర్వినియోగం వంటి సైబర్ నేరాలకు పాల్పడే అవకాశం ఉందని శిఖా గోయల్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఎస్ఎంఎస్, వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు.

# సంపాదకీయం

## జన జీవితాలలో కన్పించని జీడీపీ వృద్ధి

జనులు జీడీపీ అంకెలను భుజిస్తారా? అని ఒక విజ్ఞుడు ప్రశ్నించాడు. ఆ ప్రశ్న ఒక వ్యంగ్య ఛలోక్తి. నిజమే. ప్రజలు ఆహారాన్ని తింటారు, వస్త్రాలను ధరిస్తారు, పాదరక్షలు వేసుకుంటారు, తమ పిల్లలను బడికి పంపుతారు, వ్యాధుల నుంచి విముక్తికి ఔషధాలు కొనుక్కుంటారు, మొబైల్ ఫోన్స్ ఉపయోగిస్తారు. వీటితో పాటు టెలివిజన్ కార్యక్రమాలను వీక్షిస్తారు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులను చదవడంలో నిమగ్నమవుతారు, భద్రమైన జీవనం, సంతోషదాయక జీవితాన్ని కోరుకుంటారు–ఇవన్నీ వ్యక్తుల వినియోగాలు. ఈ మొత్తం వినియోగాల విలువ ఎంత? ప్రభుత్వం విధించే, ఇచ్చే రాయితీలను పరిగణనలోకి తీసుకున్న తరువాత వినియోగం (కన్సంప్షన్), మదుపు (ఇన్వెస్ట్‌మెంట్), ప్రభుత్వ వ్యయం (గవర్నమెంట్ స్పెండింగ్), నికర ఎగుమతులు (ఎక్స్–ఎమ్) మొత్తమే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ). ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యాన్ని కొలవడానికి జీడీపీ వృద్ధిరేటు చాలా ముఖ్యం. 2026–27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) జీడీపీ అంకెలను గణాంకాల, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ ఇటీవల విడుదల చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సర మొదటిత్రైమాసికంతో పోలిస్తే జీడీపీ వృద్ధిరేటు నామమాత్ర (ప్రస్తుత) ధరల ప్రకారం 10.3 శాతంగాను, స్థిర ధరల ప్రకారం 7.8 శాతంగాను నమోదయింది. ఈ గణాంకాల పట్ల ప్రభుత్వ ఆర్థికవేత్తలు ఎనలేని సంతృప్తి, ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. సంశయగ్రస్తులూ తక్కువేవీ కాదు. వీరు అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. జీడీపీ గణాంకాల విశ్వసనీయతపై ప్రస్తుతం ఒక తీవ్ర చర్చ నడుస్తోంది. ఫెడరల్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే 'ఒక దేశం, ఒకే ఎన్నిక' ప్రతిపాదనపై కంటే జీడీపీ అంకెలు, వాటి పెరుగుదల ప్రయోజనాలు ప్రజల జీవితాల్లో ప్రతిబింబిస్తున్నాయా అన్న విషయమై చర్చించడం మంచిది. గణాంకాల, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ వెల్లడించిన జీడీపీ అంకెలు సరైనవని భావిద్దాం. రెండు భిన్న ఆధార సంవత్సరాల (బేస్ ఇయర్స్) ప్రాతిపదికన నామమాత్ర జీడీపీ, వాస్తవ జీడీపీ సంయుక్త వార్షిక వృద్ధిరేటు (కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్–సీఏజీఆర్) ఇలా ఉంది: సంవత్సరం ఎదుట బ్రాకెట్‌లోని మొదటి సంఖ్య ప్రస్తుత ధరల ప్రకారం నామమాత్ర జీడీపీని, రెండో సంఖ్య స్థిర ధరల ప్రకారం వాస్తవ జీడీపీని లక్షల కోట్ల రూపాయల్లో సూచిస్తుంది: ఆర్థిక సంవత్సరం 2022–23: (268.90, 161.65); 2023–24: (301.23, 176.51); 2024–25: (330.68, 187.97); 2025–26: (357.14, 201.90). కొత్త ఆధార సంవత్సరం ప్రాతిపదికన 2026–27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నామమాత్ర జీడీపీ 88.26 లక్షల కోట్లు కాగా వాస్తవ జీడీపీ 81.36 లక్షల కోట్లు. 2025–26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసికంలో పెరుగుదల నామమాత్ర జీడీపీ 10.33శాతం, వాస్తవ జీడీపీ 7.82శాతం. పరిగణనలోకి తీసుకున్న నాలుగు ఆర్థిక సంవత్సరాలకు గాను సీఏజీఆర్ పాత, కొత్త ఆధార సంవత్సరాల ప్రాతిపదికన ఇంచుమించు ఒకే విధంగా ఉండడం గమనార్హం. 2026–27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు స్వల్పస్థాయిలో మాత్రమే అధికంగా ఉన్నది. దీన్నిబట్టి దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి మనం ఎటువంటి అభిప్రాయానికి రావచ్చు? ఇదీ నా అభిప్రాయం: 2026–27లో భారత ఆర్థిక వ్యవస్థ దశ దిశ మారలేదు. దాని పురోగమనం వేగం పుంజుకోలేదు. మరి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికి నిజంగా ఏమైనా ఉందా? ఏమీలేదు. పాత ఆధార సంవత్సరం ధరల ప్రాతిపదికన అంచనాలలో స్థిర ధరల్లో జీడీపీ, నామమాత్ర ధరల్లో జీడీపీతో పోలిస్తే చాలా నిరుత్సాహకరంగా ఉన్నది. అయితే కొత్త ఆధారసంవత్సరం ధరల ప్రాతిపదికన అంచనాలలో అలా లేదు. ఎందుకని? ఆ వ్యత్యాసం చాలా చికాకుపరచడం లేదూ? అదలా ఉంచితే అంకెల్లో ఘనంగా ఉన్న జీడీపీ వృద్ధిరేటు సామాన్య ప్రజల జీవితాల్లో అంతే ఉజ్వలంగా ప్రతిబింబిస్తున్నదా? ఉద్యోగాల సృష్టి, వేతనాల పెరుగుదల, వినియోగం పరిమాణం, వ్యాపార వాణిజ్యాలు, పెట్టుబడులు మొదలైన విషయాలలో ఆ వృద్ధి ఎలా కనిపిస్తోంది? కొన్ని ప్రాసంగిక ప్రశ్నలు: 15 నుంచి 29 సంవత్సరాల వయసు యువజనులలో నిరుద్యోగిత రేటు అధిక స్థాయిలో 16.2శాతం మేరకు ఎందుకు ఉన్నది? 29 నుంచి 34 సంవత్సరాల వయసులో ఉన్న పట్టభద్రులలో నిరుద్యోగిత రేటు తరచూ 40 నుంచి 45శాతం దాకా ఉంటోంది. కారణమేమిటి? నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం–15 నుంచి 29 సంవత్సరాల వయసులో ఉన్న 8.7 కోట్ల మంది యువజనులు అటు ఉద్యోగంలో గానీ, ఇటు విద్యాభ్యాసం, వృత్తిపరమైన శిక్షణలో గానీ లేరు. ఎందుకని?; వాస్తవ వేతనాల పెరుగుదల చాలా నిరుత్సాహకరంగా ఉన్నది. రోజువారీ కూలీలు, వేతన ఉద్యోగులు, స్వయం ఉపాధి కార్మికులకు ఆ వాస్తవ వేతనాల పెరుగుదల వరుసగా (–) 5.5, 1.7, 3.3 శాతంగా మాత్రమే ఉంది. దేశ కార్మికశక్తిలో రోజువారీ కూలీలు 20శాతంగా ఉన్నారు. వాస్తవ వేతనాల పెరుగుదల అంత ప్రతికూలంగా ఉన్నప్పుడు కాయకష్టంపై బతుకుతున్న కోట్లాది శ్రామికుల జీవితాలలో పండుగలు ఎలా పరిమళిస్తాయి? నికర ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు) చాలా తక్కువగా ఎందుకు ఉన్నాయి? ఎఫ్‌సీఎన్ఆర్ (ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్–ప్రవాస భారతీయుల కోసం భారతదేశంలోని బ్యాంకుల్లో విదేశీ కరెన్సీలోనే డబ్బు దాచుకునే సౌలభ్యమున్న ఒక ఫిక్సడ్ డిపాజిట్ ఖాతా. ఈ డిపాజిట్లపై 6 నుంచి 7శాతం వడ్డీ ఇస్తారు) నిధులు పెద్ద ఎత్తున సమకూరుతుండగా విదేశీ పెట్టుబడులు ప్రత్యక్ష మదుపులుగా ఎందుకు రావడం లేదు?; మన విదేశీ మారకద్రవ్య నిల్వలు ఎన్నడూ లేని రీతిలో అత్యధికం (740 బిలియన్ డాలర్లు)గా ఉన్నాయి. అయినా రూపాయి విలువ ఎందుకు పెరగడం లేదు? ఈ ఏడాది జనవరి నుంచి డాలర్–రూపాయి మారకం రేటు దాదాపు 5శాతం మేరకు తగ్గిపోయింది. ఆసియా దేశాల కరెన్సీలలో కెల్లా రూపాయి విలువే చాలా అధమంగా ఉన్నది. ఎందుకని? ఎగుమతులు పెరుగుతున్నాయి. దిగుమతులూ పెరుగుతున్నాయి. ప్రస్తుత ధరల వద్ద దిగుమతులు చాలా వేగంగా పెరుగుతున్నాయి. మన విదేశీ వాణిజ్యలోటు ఈ ఏడాది ఏప్రిల్–ఆగస్టులో 150 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నది. చైనాతో వాణిజ్య లోటు ఈ ఏడాది ఏప్రిల్–జూలైలో 44 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఈ వాణిజ్యలోటు దేశ ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా లేదూ? మేకిన్ ఇండియా, పీఎల్ఐ, ఎన్ఎమ్‌సీపీ మొదలైన పథకాలు మన తయారీరంగాన్ని ఎందుకు మెరుగుపరచడం లేదు? చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులను దేశంలోనే ఉత్పత్తి చేసుకునే సామర్థ్యాన్ని ఎందుకు సమకూర్చడం లేదు? తయారీరంగం నామినల్ జీవీఏ (నామమాత్ర స్థూల విలువ జోడింపు-- ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేయకుండా ప్రస్తుత మార్కెట్ ధరల వద్ద ఒక ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి అయిన వస్తు సేవల మొత్తం విలువను లెక్కగట్టే కొలమానం) 13శాతం వద్దే ఎందుకు స్తంభించిపోయింది? ప్రభుత్వ పథకాలు ఈ పరిస్థితిని ఎందుకు చక్కదిద్దలేకపోతున్నాయి? గ్రాస్ ఫిక్సడ్ క్యాపిటల్ ఫార్మేషన్ (జీఎఫ్‌సీఎఫ్–స్థూల స్థిర మూలధన నిర్మాణం–ఒక ఆర్థిక వ్యవస్థలో వ్యాపార సంస్థలు, ప్రభుత్వాలు సంపాదించిన, నిర్మించిన స్థిర ఆస్తుల నికర విలువను కొలుస్తుంది) జీడీపీలో 33.5శాతంగా మాత్రమే ఎందుకు ఉండిపోతోంది? ఈ జీఎఫ్‌సీఎఫ్‌లో ప్రైవేట్ కార్పొరేట్ మూలధన వ్యయం ఎంతకూ 12శాతంగా మాత్రమే ఉంటోంది. కార్పొరేట్ మదుపుదారులు మూలధన పెట్టుబడులు ఎందుకు పెట్టడం లేదు?; పెరిగిన జీడీపీ వృద్ధిరేటు మెరుగైన పాఠశాలలు, ఆస్పత్రులు, రహదారులు, మంచినీటి సరఫరా, పోలీసు సేవలకు ఎందుకు దోహదం చేయడం లేదు? ఈ సదుపాయాల విషయంలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారనేది ఒక కఠోర వాస్తవం కాదూ?

# రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై రైతుల నిరసన

## కార్యక్రమంలో పాల్గొన్న పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ





దేవరకద్ర : దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట పట్టణ కేంద్రంలో రైతుల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి డీకే అరుణమ్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డోకూరు పవన్ కుమార్ రెడ్డి దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి. కొండ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ఏ నో ప్రభావం వల్ల మహబూబ్‌నగర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, వ్యవసాయానికి నిరంతరంగా 12 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, పశువులకు దాన కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శంకర సముద్ర రిజర్వాయర్ను త్వరితగతిన పూర్తి చేసి పంట పొలాలకు నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కిషన్ మోర్చా సభ్యులు గాలి మధుసుదన్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ,లోక్ నాథ్ రెడ్డి, పద్మజ రెడ్డి, భారత్ భూషణ్,శ్రీనివాస్ రెడ్డి, అనుగ్నరెడ్డి,బలరాం రెడ్డి,రాజశేఖర్, రామకృష్ణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరసింహ, రమేష్, శ్రీనివాసులు, మల్లేష్, సురేందర్ రెడ్డి, సాయి , మాధవ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి,రమేష్,గాయత్రి సత్యం సాగర్,వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట,రంగారెడ్డి జిల్లాల ముఖ్య నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికులకు నెలకు రూ.10 వేల పింఛన్ ఇవ్వాలి



సమయం ప్రతినిధి ఐజ, సెప్టెంబర్ 12: హమాలీ కార్మికులకు నెలకు రూ.10 వేల పింఛన్ ఇవ్వడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, జీవిత బీమా, ప్రమాద బీమా వంటి సామాజిక భద్రతా సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జమ్మిచేడు కార్తీక్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ఐజ మండలంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తి చేస్తే, ఆ ఉత్పత్తులను ప్రజలకు చేరవేయడంలో హమాలీ కార్మికుల పాత్ర కీలకమన్నారు. నిత్యం బరువులు మోస్తూ శారీరక శ్రమ చేస్తున్నప్పటికీ వారికి కనీస హక్కులు, ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు, పింఛన్ తదితర సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆరోగ్య బీమా, పిల్లల విద్యా సహాయం, వివాహ సహాయం, గృహ నిర్మాణ సహాయం, సహజ మరణం, ప్రమాద మరణ పరిహారం, అంత్యక్రియల సహాయం వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీజన్‌లో స్థానిక కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానిక ఉపాధిని దెబ్బతీసే విధంగా ఇతర ప్రాంతాల నుంచి కార్మికులను తీసుకురావడాన్ని నిలిపివేయాలని కోరారు. కాంట్రాక్టర్లు, ఏజెన్సీల పేరుతో జరుగుతున్న కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ, ప్రైవేటు గోదాములు, మిల్లుల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు బోనస్ సౌకర్యం కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక కార్మిక చట్టాలను ఉపసంహరించి, కార్మికుల హక్కులను పరిరక్షించే చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసన్న, నర్సింలు, గోవిందు, భీమన్న, ప్రవీణ్, సుధాకర్, రాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిక్స్ సదస్సు: దేశాధినేతలతో ప్రధాని మోదీ వరుస ద్వైపాక్షిక భేటీలు

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ, సెప్టెంబర్ 12: ఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ దేశాల నాయకులతో వరుస ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొంటున్నారు. మలేషియా, ఇథియోపియా, వియత్నాం, యూఏఈ, ఇరాన్, చైనా అగ్రనేతలతో ప్రధాని మోదీ వరుస భేటీలు జరుపుతున్నారు.

**ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్‌తో భేటీ**

రక్షణ, వ్యాపారం: భారత్–ఇథియోపియా మధ్య ఆర్థిక సంబంధాలు, రక్షణ రంగంలో సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడిపై చర్చించారు.

గ్లోబల్ సౌత్: ఆఫ్రికన్ యూనియన్ అభివృద్ధి, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాల పరిరక్షణపై ద్వైపాక్షిక ఏకాభిప్రాయం కుదిరింది.

**మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో సమావేశం**

టెక్నాలజీ, సెమీకండక్టర్లు: మలేషియాతో బహుముఖ భాగస్వామ్యాన్ని మరింత విస్తరిస్తూ, సెమీకండక్టర్ తయారీ, క్లిష్టమైన ఖనిజాలు (Critical Minerals), క్లీన్ ఎనర్జీ రంగాలలో సంయుక్త భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చించారు.

వ్యాపారం, మౌలిక వసతులు: ఇరు దేశాల మధ్య మౌలిక సదుపాయాల కల్పన, వర్తక పెంపుపై ఒప్పందాలు పురోగతి సాధించాయి.

**అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్‌తో భేటీ**

వ్యూహాత్మక భాగస్వామ్యం: హైదరాబాద్ హౌస్‌లో జరిగిన ఈ భేటీలో భారత్–యూఏఈ (UAE) సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించడంపై చర్చించారు.

పెట్టుబడులు, ఇంధన భద్రత: క్లీన్ ఎనర్జీ, వ్యాపార కారిడార్ల ఏర్పాటు, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై ఇరునేతలు దృష్టి సారించారు.

**వియత్నాం ప్రధాని లే మిన్ హంగ్ తో భేటీ**

యాక్ట్ ఈస్ట్ పాలసీ: భారత్ 'యాక్ట్ ఈస్ట్' (Act East) విధానంలో వియత్నాంను కీలక భాగస్వామిగా మోదీ పేర్కొన్నారు.

భద్రత, ఇండో–పసిఫిక్: సముద్ర భద్రత, ఆర్థిక సహకారం, ప్రాంతీయ స్థిరత్వంపై ఇరు దేశాలు తమ కట్టుబాటును పునరుద్ఘాటించాయి.

**ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో భేటీ**

పశ్చిమాసియా పరిణామాలు: పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు, చాబహార్ పోర్ట్ (Chabahar Port) ప్రాజెక్ట్ పురోగతిపై ప్రధానంగా చర్చించారు.

స్వేచ్ఛా నౌకాయానం: అంతర్జాతీయ నౌకాయాన భద్రత, సముద్ర వాణిజ్యాన్ని కాపాడవలసిన అవసరాన్ని ప్రధాని నొక్కి చెప్పారు.

**చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌తో కీలక భేటీ (సాయంత్రం 5:45/6:00)**

సరిహద్దు సంబంధాలు (LAC): చాలా కాలం తర్వాత జరుగుతున్న ఈ కీలక భేటీలో తూర్పు లడఖ్ సరిహద్దుల్లో (LAC) సైనిక బలగాల ఉపసంహరణ, శాంతి భద్రతల పునరుద్ధరణపై ఇరు నేతలు సమీక్షించే అవకాశం ఉంది.

వాణిజ్యం, ఆర్థిక సంబంధాలు: భారత్–చైనా మధ్య నేరుగా విమాన సర్వీసులు, దౌత్య మార్గాలు, వాణిజ్య సహకారాన్ని పునరుద్ధరించడంపై సుదీర్ఘ చర్చ జరగనుంది.

# హామీలను గుర్తుచేయడం బెదిరించడం కాదు!

సమయం ప్రతినిధి: రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటుచేసి వెయ్యి రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యోగులుగా, ఉద్యోగ సంఘాలుగా మా బాధ్యత. ప్రభుత్వంలో బాధ్యతాయుతమైన భాగస్వాములుగా చాలా రోజులుగా ఆశతో మౌనంగా వేచి చూశాం. ఉద్యోగుల హక్కులు హరించివేస్తున్నప్పుడు, వారు నిర్లక్ష్యానికి గురవుతున్నప్పుడు ఉద్యోగ సంఘాలు మౌనంగా ఉండడం నేరమే అవుతుంది.

కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి పలు సందర్భాలలో ఉద్యోగులపై, ఉద్యోగ సంఘాలపై అసంతృప్తిని, ఒక రకమైన అసహనాన్ని వ్యక్తపరుస్తున్నారు. ఒక అడుగు ముందుకేసి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొడంగల్ సభలో టీచర్ల సమస్యల పరిష్కారానికి తనకు మరో రెండేళ్ల సమయం ఇవ్వాలని అభ్యర్థిస్తూ, టీచర్లను ఇతర సంఘాలతో కలవకూడదని పరోక్షంగా; ఉద్యోగ సంఘాలు రాజకీయ పార్టీల మాయలో పడవద్దని ప్రత్యక్షంగా సూచించారు. 'రాబోయే పరీక్షలో మాకు ఎన్ని మార్కులు వేస్తారో మీ ఇష్టం' అంటూ ఒక పెద్ద ప్రశ్నార్థక అంశాన్ని మా ముందుంచారు. కానీ ఒక విద్యార్థి యూనిట్ పరీక్షలన్నిటిలో పూర్తి మార్కులు సాధించినా, వార్షిక పరీక్షలు సరిగా రాయకపోతే, వచ్చే ఫలితాలకు ఉపాధ్యాయులది బాధ్యత కాదుకదా! రాష్ట్రం ఏర్పాటుతో తమ సమస్యలు తీరుతాయనే ఆశలు అందరికీ ఉన్నట్లుగానే, 42 రోజుల సకల జనుల సమ్మె చేసి రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగస్వామ్యమైన ఉద్యోగులుగా మాకు కూడా ఆశలు ఉన్నాయి. విచిత్రమేమో కానీ గత పదేళ్లుగా ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాతనైనా సమస్యలు పరిష్కారమవుతాయనుకుంటే చిన్న చిన్న సమస్యలు మినహా మూల సమస్యల పీటముడి వీడడం లేదు. చేవెళ్ల డిక్లరేషన్‌లో అభయహస్తం పేరుతో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఉద్యోగుల సమస్యలు పేర్కొంటూ... అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోగా కొన్ని ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. కానీ వారి ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులైనా ఆ హామీలను నెరవేర్చలేదు. డిసెంబర్ 7, 2023న ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. 2024 సెప్టెంబర్ 24న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాలను కమాండ్ కంట్రోల్ రూంకు ఆహ్వానించడంతో ఉద్యోగ ఫ్రెండ్లీ వాతావరణం ఏర్పడింది. 12 ఆర్థిక, 52 ఆర్థికేతర... మొత్తం 64 డిమాండ్లను ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం ముందుంచాయి. 30 మంది ఉద్యోగ సంఘాల ప్రతినిధులందరితో ప్రత్యక్షంగా మాట్లాడిన ముఖ్యమంత్రి, సానుకూలంగా స్పందించటంతో సమస్యల పరిష్కారానికి అనుకూలత ఏర్పడిందని ఉద్యోగులు సంబరపడ్డారు. కానీ వెయ్యి రోజులు గడచినా అవి పరిష్కారం కాలేదు. రాష్ట్రంలో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, రిటైర్డ్ ఉద్యోగులంతా కలిపి సుమారు పదమూడు లక్షల ఉద్యోగులవి ప్రధానంగా ఆరు డిమాండ్లు.

1) 2023 జూలై ఒకటి నుంచి రావలసిన పీఆర్సీ ఇవ్వడం. 2) ఆరు పెండింగ్ డీఏలను చెల్లించడం. 3) ఇతర పెండింగ్ బిల్లుల చెల్లింపు. 4) కాంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ. 5) ఎంప్లాయిస్ హెల్త్ కార్డుల కోసం గత మూడు నెలలుగా ఉద్యోగుల వాటా 1.5శాతం జీతంలో కట్ చేసినా, నగదు రహిత వైద్యం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు, దీన్ని పరిష్కరించడం. 6) ఉద్యోగ సంఘాల గుర్తింపు. ఇవన్నీ అధికారంలోకి వచ్చిన మూడు నుంచి ఆరు నెలల్లో అమలు చేస్తామని మేనిఫెస్టోలో చేర్చారు, కానీ అమలు కాలేదు. ఒక్కో ఉద్యోగి రిటైర్ అయితే ప్రభుత్వంపై సగటున కోటి రూపాయల భారం పడుతుందని ముఖ్యమంత్రి స్వయంగా బహిరంగ సభల్లో చెప్పడం, కొన్నిసార్లు పీఆర్సీ కూడా ఇచ్చినామని చెప్పడం పచ్చి అబద్ధం. వాస్తవానికి 33 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగికి గ్రాట్యుటీ కింద ప్రభుత్వం చెల్లించేది కేవలం పదహారు లక్షలు మాత్రమే. ఏ మాత్రం సర్వీసు తక్కువైనా ఆ మేరకు నిష్పత్తిలో, చెల్లింపులో కోత విధిస్తారు. ఇక మిగతా మొత్తం ఉద్యోగి సర్వీసులో ఉండగా తన వేతనం నుంచి జీపీఎఫ్, టీజీఎల్ఐ, జీఐఎస్ కింద పొదుపు చేసుకున్నవి, సరెండర్ లీవు, కమ్యూటేషన్‌కు సంబంధించినవి. ఇవి ప్రభుత్వ నిధులు కావు. ఈ మొత్తం రిటైర్మెంట్ రోజునే చెల్లించాలి, కానీ ఏళ్ల తరబడి చెల్లించడం లేదు. కోర్టులకు వెళ్లేవారికి మాత్రమే చెల్లిస్తున్నారు. దీనిని కూడా ప్రభుత్వ ఖాతా నుంచి చెల్లిస్తున్నామనడం ప్రజల్లో ఉద్యోగులపై అసూయ ఏర్పడేటట్లు చేయడమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అగర్వాల్ పీఆర్సీ కమిషన్ 29శాతం ఫిట్‌మెంట్ సిఫార్సు చేసింది. ఉద్యోగ సంఘాలు 42 రోజులు సమ్మె చేసి తెలంగాణ సాధించినందుకు 42శాతం డిమాండ్ చేయగా, అప్పటి ప్రభుత్వం ఒక శాతం అదనంగా 43శాతం ఫిట్‌మెంట్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో బిస్వాల్ పీఆర్సీ కమిషన్ 7.5శాతం ఫిట్‌మెంట్ సిఫార్సు చేయగా, ప్రభుత్వం 30శాతం ఫిట్‌మెంట్ ఇచ్చింది. రెండు సందర్భాలలోనూ డీఏలు పెండింగులో లేకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా 1–7–2028 నుంచి మూడో పీఆర్సీ రానున్నది, కానీ ప్రస్తుతం 2023 నుంచి రావలసిన రెండో పీఆర్సీ పెండింగ్‌లోనే ఉన్నది. రెగ్యులర్ ఉద్యోగులకు చెల్లించే పెండింగ్ బిల్లులు ఏళ్ల తరబడి పేరుకుపోతున్నాయి. ధనిక రాష్ట్రంలో 2024 నుంచి ఉద్యోగులకు ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంగా 15.47శాతం డీఏ రావలసి ఉంది. అంటే ప్రజాప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఒక్క డీఏ కూడా ఉద్యోగులకు రాలేదు. డీఏ అనేది ప్రభుత్వం ఉద్యోగులకు దయాదాక్షిణ్యాలతో ఇచ్చేది కాదు. దేశంలో పెరుగుతున్న ధరల సూచీ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ నిర్ణయిస్తుంది.





# అప్రకటిత విద్యుత్ కోతలపై రైతుల ధర్నా.....





అమరచింత : శనివారం నాడు అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ వనపర్తి మండలం నాచహల్లి క్రిష్ణగిరి, పెద్దగూడెం తండా, సవాయిగూడెం గ్రామాలకు చెందిన రైతులు శనివారం సబ్‌స్టేషన్ సమీపంలో ఆందోళనకు దిగారు. వనపర్తి–పెబ్బేరు ప్రధాన రహదారిపై బైఠాయించి విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే డీఈతో మాట్లాడించాలని రైతులు పట్టుబట్టారు. దీంతో ఏఈ ఫోన్ ద్వారా డీఈతో రైతులకు మాట్లాడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ...... అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు 13 గంటల పాటు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కూడా టీవీల్లో ప్రభుత్వ ప్రకటనలను చూస్తున్నామని, ప్రజలకు ఏమీ తెలియదన్నట్లుగా అధికారులు ఇష్టానుసారంగా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఏఈతో కలిసి లాగ్‌బుక్‌ను పరిశీలించగా.. వాస్తవంగా సరఫరా చేసిన సమయం కంటే ఎక్కువ సమయం విద్యుత్ ఇచ్చినట్లుగా నమోదు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్ సరఫరా చేశారని, ఇప్పుడు పరిస్థితి దారుణంగా మారిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. "కేసీఆర్ ప్రభుత్వం పోయినప్పుడే కరెంటు కూడా పోయిందా?" అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేసినందుకు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోకుండా అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించి రైతులను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, లిరైతులతో పాటుమండల పార్టీ అధ్యక్షులు కే మాణిక్యం, సింగల్ విండో అధ్యక్షులు రఘువరన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ధర్మ నాయక్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ దేగ మహేష్ రెడ్డి, నాయకులు రవి ప్రకాష్ రెడ్డి, నారాయణ నాయక్, శంకర్ నాయక్, టికె నాయక్, సర్పంచ్ పద్మ వెంకటయ్య,మాజీ సర్పంచ్ బాలకృష్ణ, మహేష్, అంజి, రూప్ల నాయక్, గోవిందు నాయక్,శివ,ఆనంద్, తులసి రామకృష్ణ, శ్రీను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యువ భారత క్రీడా విశ్వవిద్యాలయంతో తెలంగాణను క్రీడా శక్తిగా తీర్చిదిద్దుతాం




### క్రీడలను విద్యతో అనుసంధానం చేసి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తాం
### శాసన మండలిలో మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్: తెలంగాణలో క్రీడలను విద్యతో అనుసంధానం చేసి, అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడాకారులను తీర్చిదిద్దే లక్ష్యంతో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (YIPESU) ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.శాసనమండలిలో సభ్యులు బల్మూర్ వెంకట నర్సింగరావు, మహేష్ కుమార్, శ్రీపాల్ రెడ్డి, అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి శాస్త్రీయ శిక్షణ, అత్యుత్తమ కోచింగ్ అందించడంతో పాటు స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, పరిశోధన వంటి విభాగాలను ఒకే వేదికపైకి తీసుకురావడమే YIPESU ప్రధాన లక్ష్యమని మంత్రి వివరించారు. విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు దేశీయ, అంతర్జాతీయ ప్రముఖ క్రీడా విద్యాసంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా లికొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీ (KNSU)తో సహకారానికి సంబంధించిన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

**క్రీడా విజ్ఞానంతో పాటు ఉపాధి అవకాశాలు**

క్రీడాకారులకు కేవలం మైదానంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా ఆధునిక క్రీడా విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన ఆధారిత శిక్షణ అందించే విధంగా YIPESUలో కోర్సులను రూపొందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్ వంటి అంతర్జాతీయ పోటీలకు తెలంగాణ క్రీడాకారులను సిద్ధం చేసేందుకు High Performance Centresతో పాటు ఆధునిక శిక్షణ విధానాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**గ్రామీణ ప్రాంతాల నుంచే క్రీడా ప్రతిభను వెలికితీస్తాం**

క్రీడా ప్రతిభ పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా తెలంగాణలోని ప్రతి గ్రామం నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాల అభివృద్ధి, ఇప్పటికే ఉన్న మైదానాల ఆధునీకరణ, క్రీడా పరికరాల సమకూర్పు, పాఠశాల స్థాయి నుంచే క్రీడా ప్రతిభను గుర్తించడం, మండల–జిల్లా స్థాయిలో ప్రతిభా అన్వేషణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. అలాగే స్థానిక కోచ్‌లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు శిక్షణ ఇవ్వడంతో పాటు అథ్లెటిక్స్, హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడలకు ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు.ఇప్పటికే సీఎం కప్ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఐదు అంచెలలో నిర్వహించామని, 2024 లో 12 కోట్ల వ్యయంతో 36 క్రీడ అంశాలతో 2 లక్షల 90 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. 2025లో 38.50 కోట్లతో 46 క్రీడాంశాలతో 5.42 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయని వెల్లడించారు. గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించి, ప్రతిభావంతులైన క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర స్థాయి అకాడమీలతో అనుసంధానం చేస్తామని తెలిపారు. బాలికలు, యువత క్రీడల్లో మరింతగా పాల్గొనేలా ప్రత్యేక ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడతామని మంత్రి వెల్లడించారు.

**క్రీడాకారులకు ప్రోత్సాహం**

క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 145 మంది క్రీడాకారులకు 16 కోట్ల 60 లక్షలు ఇచ్చి, స్పోర్ట్స్ కోట ద్వారా 304 మంది అథ్లెట్లకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. మహమ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్లకు డిఎస్పి స్థాయి ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో క్రీడా మైదానం – ప్రతి యువకుడిలో క్రీడా ప్రతిభను పెంచి తద్వారా తెలంగాణను దేశంలోనే క్రీడా శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం క్రీడా రంగాన్ని బలోపేతం చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. YIPESU ద్వారా క్రీడలు–విద్య–ఉపాధి–పరిశోధనలను అనుసంధానం చేసి, తెలంగాణ యువతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని అవకాశాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు బడ్జెట్లలోనే క్రీడారంగానికి 1,535 కోట్లు కేటాయించగా, బి ఆర్ ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో కేటాయించిన మొత్తం కంటే ఈ ఒక్క ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వ క్రీడా బడ్జెట్ ఎక్కువగా ఉందని తెలిపారు. గత కేటాయింపులతో పోలిస్తే క్రీడా బడ్జెట్ నాలుగు రెట్లు పెరిగిందన్నారు. గచ్చిబౌలిలో నూతన హాకీ స్టేడియం కోసం 2 టర్ఫులను ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్తో 700 కోట్లతో ఆధునీకరిస్తున్నామన్నారు. క్రీడా అకాడమీల సంఖ్య 6 నుంచి 19 కి పెరిగాయని,2024 –26 మధ్య 13 కొత్త అకాడమీలు ఏర్పాటు చేశామని మంత్రి పేర్కొన్నారు. ఇందులో రెండు ఎలైట్ ఫిఫా ఫుట్బాల్ అకాడమీలు ఉన్నాయని, మహిళల ఫిఫా అకాడమీ దేశంలోనే మొట్టమొదటిదని మంత్రి స్పష్టం చేశారు. హకీంపేట్ కరీంనగర్ ఆదిలాబాద్ లో ఇప్పటికే మూడు స్పోర్ట్స్ స్కూల్స్ ఉండగా హనుమకొండలో కొత్త స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభం అయ్యిందని తెలిపారు. హైదరాబాదులో తొలిసారిగా FIH హాకీ ఉమెన్స్ వరల్డ్ కప్ 2026 క్వాలిఫైయర్స్ నిర్వహించామన్నారు. హైదరాబాద్ వేదిక నుంచి టాప్ మూడు జట్లు ప్రపంచ కప్ కు అర్హత సాధించాయని మంత్రి వెల్లడించారు. డిసెంబర్ 11 నుండి 22 వరకు 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 నిర్వహణ ను 272 కోట్ల అంచనా వ్యయం తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించబోతోందని తెలియజేశారు. ఖేలో ఇండియా గేమ్స్ తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించేందుకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హాకీ ఇండియా లీగ్ ,వరల్డ్ పికిల్ బాల్ లీగ్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్,టెన్నిస్ ప్రీమియర్ లీగ్లు ఈ ఏడాది తెలంగాణలో నిర్వహించనున్నామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

## మల్లికార్జున ఖర్గేను కలిసిన మధుయాష్కి గౌడ్

### AIPC చైర్ పర్సన్ గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపిన మధుయాష్కి గౌడ్



హైదరాబాద్ : ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్‌గా నియమితులైన మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ గారు ఈ రోజు ఏఐసీసీ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గేని బెంగళూరులోని వారి నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఖర్గే కి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించిన మధుయాష్కి గారు.. తనపై ఎంతో నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత అప్పగించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వివిధ రంగాల్లోని వృత్తి నిపుణులు, మేధావులను కాంగ్రెస్ పార్టీకి అనుసంధానం చేస్తూ.. వారందరినీ జాతీయస్థాయిలో ఒకే వేదికపై తీసుకువచ్చే విషయాలపై ఈ సందర్భంగా ఖర్గే మధుయాష్కికి దిశానిర్దేశం చేశారు.

## ఏలేటి మహేశ్వర్ రెడ్డికి ఆవేశం ఎక్కువ.. ఆలోచన తక్కువ!

### GMR దేవరకద్ర శాసన సభ్యులు



హైదరాబాద్ : భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో దేశస్థాయిలో ప్రధానమంత్రి, రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి, జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ కీలక నిర్ణయాధికారులుగా పరిపాలనను నడిపిస్తారు. మంత్రులు, ఐఏఎస్‌లు, ఇతర అధికారులు తమ తమ శాఖలు, బాధ్యతల పరిధిలో పనిచేస్తారు. ముఖ్యమంత్రి ఒక శాఖపై సమీక్ష నిర్వహిస్తున్నప్పుడు సంబంధిత మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఐఏఎస్ అధికారులు, ఉన్నతాధికారులు మొత్తం యంత్రాంగం అక్కడే అందుబాటులో ఉంటుంది. అక్కడే చర్చలు జరుగుతాయి.. అక్కడే నిర్ణయాలు తీసుకుంటారు.. ఆ నిర్ణయాలను అధికారులు క్షణాల్లో అమలు చేసేలా వ్యవస్థ పనిచేస్తుంది.ఈ కనీస పరిపాలనా విధానం కూడా అర్థం చేసుకోకుండా... ఏదో విమర్శించాలి కాబట్టి విమర్శించడం రాజకీయ విమర్శ కాదు.. అది కేవలం ఆవేశం! మహేశ్వర్ రెడ్డి గారూ..ముందు ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో తెలుసుకోండి..తర్వాత ప్రభుత్వంపై మాట్లాడండి! ఆవేశంతో ఆరోపణలు చేయడం నాయకత్వం కాదు..ఆలోచనతో మాట్లాడటం, వ్యవస్థను అర్థం చేసుకుని విమర్శించడేం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకత్వం. ప్రజలకు పాలన కావాలి.. రాజకీయ డ్రామాలు కాదన్నారు.

## దేవరకొండలో త్రాగునీటి కోసం ఆందోళన



దేవరకొండ: నేరడుగొమ్ము: సెప్టెంబర్ 12 (సమయం ప్రతినిధి) : నేరడుగోమ్ము మండలం పందిరి గుండు తండా గ్రామపంచాయతీ పరిధిలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. పందిరి గుండు తండా, పైమూల తండా, కిందిమూల తండా, ఇంద్రవత్త తండాల్లోని దాదాపు 3,000 మంది జనాభా చుక్క నీటి కోసం అల్లాడిపోతున్నారు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు ముఖం చాటేయడంతో చెరువులు మైదానాలుగా మారాయి. ఎండిపోయిన చెరువులో తోడిన చిన్న గుంత దగ్గర నీటి కోసం మహిళలు బిందెలతో బారులు తీరారు.





# అప్పంపల్లిలో అమరవీరులకు నివాళులర్పించిన అరుణమ్మ

## తెలంగాణ విమోచన దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల స్థూపానికి ఎంపీ డీకే అరుణ నివాళి



కౌకుంట్ల, సెప్టెంబర్ 12, సమయం ప్రతినిధి : తెలంగాణ విమోచన దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామంలో బీజేపీ ఎంపీ డీకే అరుణ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన వీరుల త్యాగాలను ఆమె స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1947 అక్టోబర్ 7న అప్పంపల్లి గ్రామంలో బెల్లం నాగన్న నాయకత్వంలో రజాకార్ల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 11 మంది అమరులయ్యారని, అనేక మంది గాయపడ్డారని గుర్తుచేశారు. రజాకార్ల అరాచకాలకు ఈ ప్రాంతంలోని రావి చెట్టు సజీవ సాక్ష్యంగా నిలిచిందన్నారు. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందినా తెలంగాణ ప్రాంతానికి మాత్రం వెంటనే స్వాతంత్ర్యం రాలేదన్నారు. రజాకార్ల అరాచకాలపై సమాచారం తెలుసుకున్న అప్పటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు పోలీసు చర్య చేపట్టారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీకే అరుణ అన్నారు. గతంలో బీఆర్ఎస్ అనేక హామీలు ఇచ్చినా విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా



ఒక వర్గం మెప్పు కోసం అధికారికంగా నిర్వహించడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తోందని, ఈ ఏడాది కూడా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొననున్నారని తెలిపారు. అప్పంపల్లి అమరవీరుల త్యాగం, చరిత్ర ఎన్నటికీ చెరిగిపోదని, అమరుల రక్తంతో తడిసిన అప్పంపల్లి నేల పవిత్రమైనదని డీకే అరుణ పేర్కొన్నారు. కార్యక్రమంలో రతంగ్ పాండు రెడ్డి, పగడాకుల శ్రీనివాస్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, బలరాం రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, యజ్ఞ భూపాల్, రఘురామయ్య, తిరుపతి రెడ్డి, లక్ష్మీ శ్యామ్ సుందర్, రమేష్, కేశవ రెడ్డి, సర్పంచ్ మనోహర్ రెడ్డి, కృష్ణవర్ధన్ రెడ్డి, వీరబ్రహ్మాచారి, చెన్నారెడ్డి, రాజు, కర్నె స్వామి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకోట లో నూతన ఐ మాక్స్ లైట్ ప్రారంభోత్సవం



సమయం ప్రతినిధి : మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి డీకే అరుణమ్మ గారు,డోకూర్ పవన్ కుమార్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గారు, కొండ ప్రశాంత్ రెడ్డి బీజేపీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జ్ గారు,ఈ రోజు కొత్త కోట పట్టణంలో 7వ వార్డు అంగన్వాడీ స్కూల్ దగ్గర ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లు ప్రారంభించారు. 7 వార్డు కౌన్సిలర్ సత్యంగాయత్రి,నవీన్ రెడ్డి,టౌన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యచరణ : మంత్రి జూపల్లి



హైదరాబాద్ : రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వంటి మహమ్మారుల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలి పారు. మద్యపానం, ప్రైవేటు విద్య మరియు వైద్యం, వేడుకలు, బెట్టింగులు, సైబర్ మోసాల బారిన పడి ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాలు, లఘుచిత్రాలు, డిజిటల్ మీడియా, వీధి నాటకాలు వంటి వివిధ రకాల మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. దీని కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు.

## దేవరకొండ ఆర్టిసి డిపో నుండి మద్దిమడుగు అదనపు బస్సులు



దేవరకొండ: సెప్టెంబర్ 12 (సమయం ప్రతినిధి) :దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో దేవరకొండ నుంచి నాగర్ కర్నూలు జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన మద్దిమడుగుకు బస్సుల సంఖ్య పెంచినట్లు డిపో మేనేజర్ విజయకుమారి తెలిపారు. దేవరకొండ నుంచి మద్దిమడుగు ఉదయం 7:00,10:15,మధ్యాహ్నం 3:00 గంటలకు.. మద్దిమడుగు నుంచి దేవరకొండకు ఉదయం 5:00,11:30, మధ్యాహ్నం 2:00 గంటలకు (దేవరకొండ–మాచర్ల). బస్సులు నడుస్తున్నాయని డిపో పరిధిలోని ప్రయాణికులు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అసెంబ్లీకి రావడానికి బీఆర్ఎస్‌కు భయమెందుకు? - ఎంపీ మల్లు రవి సూటి ప్రశ్న




హైదరాబాద్ : రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యతను విస్మరించి, తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ పేరుతో బీఆర్ఎస్ నాయకులు కాలయాపన చేస్తున్నారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి తీవ్రస్థాయిలో విమర్శించారు. అసెంబ్లీకి వస్తే గత బీఆర్ఎస్ పాలనలోని అరాచకాలు, అవినీతి, అక్రమాల చిట్టా బయటపడుతుందనే భయంతోనే అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నారా? ప్రజల తరఫున ప్రశ్నించాల్సిన అసెంబ్లీని వదిలేసి తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ పెట్టుకోవడం ఎందుకు? ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ డ్రామా కాదా? గత పదేళ్ల పాలనలో చేసిన అవినీతి, అక్రమాలపై సమాధానం చెప్పాల్సిన సమయంలో తప్పించుకునేందుకు మాక్ అసెంబ్లీ పేరుతో కొత్త నాటకాలకు తెరలేపు తున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై అసెంబ్లీలో నిలదీయకుండా బయట మాక్ అసెంబ్లీలు నిర్వహించడం ద్వారా బీఆర్ఎస్ నాయకులు తమ బాధ్యత నుంచి తప్పించు కోలేరని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. "అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై మాట్లాడే ధైర్యం లేకనే తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ పెట్టుకుని కాలయాపన చేస్తున్నారు. అసెంబ్లీలో చర్చ జరిగితే తమ పాలనలోని అవినీతి, అరాచకాల చిట్టా బయటపడుతుందనే భయమే దీనికి కారణం" అని ఘాటుగా విమర్శించారు.

## జ్యోతి మరణం విషాదకరం

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ రాములుని పరామర్శించిన తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షులు,సిపిఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి.

అమరచింత : కమ్యూనిస్టు పార్టీ ప్రజా ఉద్యమాలకి ఉతంగా నిలిచిన కామ్రేడ్ జ్యోతి ఆకస్మిక మరణం పెను విషాదకరమని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షులు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని శ్రీకృష్ణ నగర్ గొల్లవీధి లో ఈనెల 6న తీవ్రమైన అనారోగ్యంతో మృతి చెందిన సిపిఐ జిల్లా కార్యదర్శి కే.విజయరాములు సతీమణి, పంచాయతీ కార్యదర్శి జ్యోతి చిత్రపటానికి చాడ వెంకటరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి విజయ రాములు కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ విజయ రాములు చిన్నతనము నుండి విప్లవ భావజాలంతో పెరిగారని ప్రజా సమస్య పరిష్కారం సమసమాజ స్థాపనే లక్ష్యంగా సాగిన పోరాటాల్లో పాలకుల అనేక నిర్బంధాలను జైలు జీవితాలు సైతం అనుభవిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న జ్యోతి ఏనాడు బూర్జవ ఆలోచనల వైపు నడవలేదని అన్నారు. కుటుంబ పోషణ, బాధ్యత కోసం జ్యోతి అనేక ఇబ్బందులు అవమానాలు ఎదుర్కొన్నారని ఉన్నత చదువులు చదువుకొని గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ప్రభుత్వ ఉద్యోగం పొందిందని అన్నారు. జ్యోతిని క్యాన్సర్ మహమ్మారి కవలించడం బాధాకరమని శాస్త్ర సాంకేతిక రంగాల అత్యాధునిక వైద్య సేవల అందుబాటులో ఉన్నాయని ప్రగల్బాలు పలుకుతున్న క్యాన్సర్ లాంటి రోగాలకు నేటికీ పూర్తిస్థాయి వైద్యం లేదని అన్నారు. జ్యోతి కమ్యూనిస్టు కార్యకర్తల పట్ల నాయకుల పట్ల ఎంతో అభిమానం చూసేవారని అన్నారు. జ్యోతి మరణం కమ్యూనిస్టు పార్టీకి విజయ రాములు కుటుంబానికి ఎంతో తీరనిలోటని జ్యోతి ఆశయ



సాధనకు పార్టీ శ్రేణులు సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సిపిఐ మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్, సిపిఐ నేత పరమేశ్ గౌడ్,సిపిఐ నేతలు అబ్రహం శ్రీహరి నరసింహ శెట్టి రాబర్ట్ అబ్రహం,మోష,భరత్, లక్ష్మీనారాయణ శెట్టి సురేష్, రాంపూర్ సర్పంచ్ నాగరాజ్, శ్యాంసుందర్,రవీందర్, కథలప్ప, లక్ష్మీనారాయణ, కుమార్,బాలరాజ్, రవీందర్,బాలకృష్ణ, బాలస్వామి,నాగేంద్రం కురుమూర్తి, గీత, పద్మావతి, శ్యామల, శారద,భారతి, లయ తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ
# బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి







**- ఖాళీగా ఉన్న 3 మంత్రులు, ఖాళీ కాబోతున్న ఎమ్మెల్సీ పదవులను బీసీ లకు ఇవ్వాలి.**

**- జనగణనలో ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతనే కులగణన చేపట్టాలి. - వి శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి**

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ రాజకీయ ముఖచిత్రం రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ గారు, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి గారు, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ చిరంజీవులు గారు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షులు బాలగోని బాల్‌రాజు గౌడ్ తో పాటు రాష్ట్రంలోని 55 బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ....... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిచాలి. విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం చేయాలన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 3 మంత్రి పదవులను బీసీలకు కేటాయించాలని, ఖాళీ కాబోతున్న ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు, అత్యంత వెనుకబడిన వర్గాలకు (ఎంబీసీలకు) ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. బీసీ కులగణన అంశంపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్ లో మరింత గట్టిగా మాట్లాడాలని, దేశవ్యాప్తంగా కులగణన జరిగేలా బీజేపీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపడతామని ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతనే కులగణన చేయాలని, కులగణనతో పాటు చట్టసభల్లో కూడా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎన్నికల సమయంలో బీసీలకు హామీలు ఇచ్చి బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు.విద్య, ఉద్యోగాల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించడంతో పాటు రాజకీయ రంగంలోనూ జనాభా ప్రాతిపదికన అన్ని పార్టీల్లో బీసీలకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న అన్యాయాలు, దాడులను ప్రతిఘటించాలని, బీసీ ల కులగణన, బీసీ రిజర్వేషన్లు, హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా కార్యాచరణ చేపట్టి బీసీలను చైతన్యవంతులను చేసి బీసీల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కటకం నర్సింగరావు గారు, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ గారు, ఎంబీసీ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు నీరజ, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, గౌడ కల్లు గీత వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, శేఖర్, బీసీ సంఘాల నాయకులు దుర్గయ్య, పబ్లిక్ సెక్టార్ అధ్యక్షులు రాజేశం తదితరులతో పాటు వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ మత విద్వేష అరాచక పాలనకు చరమగీతం పాడాలి
## రాజకీయ విలువలను దిగజారుస్తున్న అధికార ప్రతిపక్ష పార్టీలు




**సిపిఐ జాతీయ నాయకులు చాడా వెంకటరెడ్డి**

అమరచింత : కేంద్రంలోని నరేంద్ర మోడీ ఫాసిస్ట్,మత విద్వేష అరాచక పాలనకు చరమగీతం పాడాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మక్తల్ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గత వారం రోజులుగా రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల వైఖరితో రాజకీయ హైడ్రామా నడుస్తుందని ఈ రెండు పార్టీలు ఎంతో హుందాగా ఉండాల్సింది పోయి రాజకీయ సంప్రదాయాలను మంటగలిపే విధంగా ఉన్నాయని సిపిఐ జాతీయ నాయకులు మాజీ శాసన సభ పక్షా నేత చాడ వెంకటరెడ్డి తీవ్రంగా విమర్శించారు.నేటితరం యువతీ యువకులు రాజకీయాల్లోకి రావాలని ఆసక్తి రోజుకి తగ్గుతుందని ప్రస్తుత రాజకీయ వ్యవహారాలు చూస్తే అది మరింత బలపడే ప్రమాదం ఉందన్నారు ప్రజాస్వామ్యంలో యువత రాజకీయాల్లోకి రావాలంటే అధికార ప్రతిపక్ష పార్టీలు ఎంతో హుందాగా వ్యవహరించాలని చాడా వెంకటరెడ్డి సూచించారు ప్రజల డబ్బుతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కొనసాగాల్సిన అసెంబ్లీ సమావేశాలు వ్యక్తిగత దూషణలు పరమ బూతులు ఇవే నేడు మీడియాలో, పత్రికల్లో కనబడుతున్నాయని ఎవరు ఎవరిని ఎంత ఎక్కువ తిడితే అంత గొప్ప వాళ్ళం అనేటువంటి భావనకు ఈ రెండు పార్టీలు వచ్చేసాయని ఇది చాలా ప్రమాదకరం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేసే అంశంపై చర్చించకుండా, ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన కరువు మేఘాలు కమ్ముకున్నా యని రైతులు ప్రజలు తీవ్ర ఆందోళనలు ఉన్నారని ఎలా ఆదుకోవాలని చర్చ జరగకుండా ఇలా ఇష్టం వచ్చినట్టుగా 90% అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్న రెండు పార్టీలు బాధ్యతారహితంగా వ్యవహరించడం బాధాకరమని ఆయన విమర్శించారు త్వరలో జిల్లాలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టుల పనులు ప్రారంభంచేలా సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సెక్టోబర్ 17వ తేదీ నిజానికి అది తెలంగాణ స్వాతంత్ర దినం అని దాన్ని అధికారికంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఏం అడ్డం వస్తుందని ఆయన ప్రశ్నించారు 4500 మంది అమరవీరుల ప్రాణ త్యాగం కనపడలేదా అని ఆయన ప్రశ్నించారు పదివేల గ్రామాలను విముక్తి చేసిన పోరాటం 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచిన ఒక పెద్ద ఘట్టం ప్రభుత్వానికి ఎందుకు కనబడడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు మహారాష్ట్ర కర్ణాటక ప్రభుత్వాలు ఆ రాష్ట్రంలో రెండు మూడు జిల్లాలుంటే అధికారికంగా నిర్వహిస్తున్నాయని 33 జిల్లాల కేంద్రబిందువైన తెలంగాణలో మాత్రం ఎందుకు సెప్టెంబర్ 17 విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేకపోతున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఇప్పటికైనా ప్రభుత్వం ఈ 17న అధికారికంగా తెలంగాణ విలిన దినోత్సవాన్ని నిర్వహించాలని చాడా వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, సిపిఐ మహబూబ్నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్,మాజీ జిల్లా కార్యదర్శి పరమేష్ గౌడ్,సిపిఐ మండల కార్యదర్శి ఏ అబ్రహం నియోజకవర్గ కార్యదర్శి శ్రీహరి సిపిఐ నాయకులు మోష, సీఎన్ శెట్టి, రాబర్ట్, భరత్, లక్ష్మీనారాయణ శెట్టి,భాస్కర్, రవీందర్ శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ, రఘు, ఆర్.ఎన్.కుమార్,కథలప్ప, నాగరాజ్, ఎర్రన్న, సౌలు ఇజ్రాయిల్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) అసెంబ్లీ ముట్టడి

దేవరకొండ: సెప్టెంబర్ 12 (సమయం ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడి పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ కార్యకర్తలు, నాయకులపై ముందస్తు అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంవిద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సింది పోయి, వాటి గురించి ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులను అర్ధరాత్రి వేళల్లో ఇళ్లకు వెళ్లి భయాందోళనలకు గురిచేస్తూ అరెస్టు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయం ఏబీవీపీ ఎప్పటినుంచో విద్యార్థుల హక్కులు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా రంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలు నిర్వహిస్తోంది. ఇటువంటి అక్రమ అరెస్టులతో ఉద్యమ స్ఫూర్తిని అణచివేయలేరుప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలపై స్పందించి, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తోంది. విద్యార్థుల హక్కుల సాధన కోసం ఏబీవీపీ ప్రజాస్వామ్యబద్ధంగా తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని తెలియజేస్తున్నాము అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు – యలమల గోపీచంద్, ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్.

## గాజుల అభినవ్ రాజ్ సంస్కరణ సభలో పాల్గొన్న
## దేవరకొండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు టీవీఎన్ రెడ్డి



దేవరకొండ: సెప్టెంబర్ 12 (సమయం ప్రతినిధి) : బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సీనియర్ న్యాయవాది గాజుల ఆంజనేయులు తమ్ముడు గాజుల రాజేష్ కుమారుడు గాజుల అభినవ్ రాజ్ సంస్కరణ సభలో దేవరకొండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు టీవీఎన్ రెడ్డి, కొండమల్లెపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమావత్ దాస్రు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాజుల అభినవ్ రాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టి వి ఎన్ రెడ్డి మాట్లాడుతూ......గాజుల అభినవ్ రాజ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. చిన్న వయసులోనే ఆయన మృతి చెందడం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తీరని లోటని పేర్కొన్నారు.అభినవ్ రాజ్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. ఆయన వెంట బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నీల రవికుమార్, కౌన్సిలర్ పొట్ట మధు, బిఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర నాయకులు. జనీబాబ, సోషల్ మీడియా కన్వీనర్ వాజిద్ పాషా,వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

## జడ్చర్లలో జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశం






**హాజరైన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి**

మహబూబ్‌నగర్ : జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డీసీసీ కార్యవర్గ సమావేశం జడ్చర్లలోని చంద్ర గార్డెన్స్‌లో నిర్వహించారు.ముఖ్య అతిథిలుగా హాజరైన సీడబ్ల్యూసీ సభ్యులు శ్రీ చల్లా వంశీచంద్ రెడ్డి మార్గదర్శకత్వంలో,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ నాయకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు నాయకులు,కార్యకర్తలు ఐక్యతతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి హాజరై డీసీసీ కార్యవర్గ సభ్యులతో కలిసి సంస్థాగత అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీని జిల్లా వ్యాప్తంగా మరింత బలోపేతం చేయడం, మండల,గ్రామ,బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడం, కార్యకర్తల సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై చర్చించడం జరిగింది.డీసీసీ,అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి కమిటీల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంతో పాటు రాబోయే పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు నాయకులు,కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో TGMFC ఒబేదులా కొత్వాల్,టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి,డీసీసీ ప్రధాన కార్యదర్శి దోమ పరమేశ్వర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎన్.పి వెంకటేష్,గోనెల శ్రీనివాస్,రబ్బానీ,అశోక్ యాదవ్ ఎన్.పి నేహా శ్రీ,జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ అల్వాల్ రెడ్డి,స్పోక్స్ పర్సన్ నిత్యానంద్,డీసీసీ కమిటీ నాయకులు,మండల అధ్యక్షులు,వివిధ విభాగాల అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెల్లిపాకల రిజర్వాయర్ కోసం భూములు కోల్పోతున్న
## రైతులకు న్యాయం చేయాలి రామావత్ రమేష్ నాయక్




దేవరకొండ: సెప్టెంబర్ 12 (సమయం ప్రతినిధి) : పెల్లిపాకుల రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు భూములను కేటాయిస్తున్న క్రమంలో, ఆ భూములను కోల్పోతున్న దేవరోని తండకు చెందిన పేద రైతులకు కూడా న్యాయం చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామావత్ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఈరోజు దేవరకొండ సబ్-కలెక్టర్ నీ కలిసి రైతుల సమస్యలపై వివరంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. రిజర్వాయర్ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కోసం భూములను కేటాయించే క్రమంలో పేద రైతులకు చెందిన పట్టా భూములను తీసుకుంటున్నారని, అయితే ఆ భూములకు నిర్ణయిస్తున్న పరిహారం/కన్వర్షన్ విలువ చాలా తక్కువగా ఉందని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఒకవైపు రిజర్వాయర్ కారణంగా నిర్వాసితులవుతున్న కుటుంబాలకు పునరావాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, అదే సమయంలో ఆ పునరావాసం కోసం తమ భూములను కోల్పోతున్న పేద రైతుల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాపాడాల్సిన బాధ్యత ఉందని పేద రైతుల భూములను తక్కువ విలువకు తీసుకోవడం వల్ల వారు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని, కాబట్టి భూముల వాస్తవ విలువను పరిగణనలోకి తీసుకుని న్యాయమైన పరిహారం అందించాలని ఆయన కోరారు. రైతులకు అన్యాయం జరిగితే వారి తరఫున తాను ముందుండి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అవసరమైన స్థాయిలో పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. "ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయడం ఎంత ముఖ్యమో, వారి పునరావాసం కోసం భూములు కోల్పోతున్న పేద రైతులకు న్యాయం చేయడం కూడా అంతే ముఖ్యం" అని అన్నారు.

# రైతుల సమస్యలపై పోరాటం తప్పదు: డీకే అరుణ

## రైతుల పక్షాన బీజేపీ అండగా ఉంటుంది

**వనపర్తి, సెప్టెంబర్ 12, సమయం ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా విస్మరించిందని బీజేపీ ఎంపీ డీకే అరుణ విమర్శించారు. వనపర్తి జిల్లా కొత్తకోట క్రాస్‌రోడ్‌లో నిర్వహించిన రైతు నిరసన దీక్షకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.
కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చిందని, రైతు డిక్లరేషన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి అరకొరగా చేశారని, అర్హత ఉన్న ప్రతి రైతుకు సంపూర్ణ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద రూ.15 వేలిస్తామని చెప్పి ఆ హామీని కూడా అమలు చేయడం లేదన్నారు.పాలమూరు-రంగారెడ్డి, భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పంటలకు సరిపడా విద్యుత్ అందక పొలాలు ఎండిపోతున్నాయని, పాలమూరు ప్రాంత రైతులకు కనీసం ఆరు గంటలైనా నిరంతర విద్యుత్ అందడం లేదని అన్నారు.పండించిన పంటలను ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో దళారులు లాభపడుతున్నారని, నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసే పరిస్థితి ఏర్పడటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని, రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా పడకేసిందని డీకే అరుణ ఆరోపించారు. ధరణి పేరుతో గత ప్రభుత్వం ఇబ్బందులు సృష్టిస్తే, భూ భారతి పేరుతో పట్టా భూములను సైతం నిషేధిత జాబితాలో చేర్చి రైతులను రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం "కమిషన్, అవినీతి ప్రభుత్వం"లిగా ప్రజలకు అర్థమైందని ఆరోపించారు. కర్ణాటక, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతిలో కూరుకుపోయాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి మరకలేని పాలన అందిస్తూ వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. విద్యుత్ శాఖపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి రైతాంగానికి నిరంతర విద్యుత్ అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని డీకే అరుణ డిమాండ్ చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతుల హక్కుల కోసం బీజేపీ అండగా ఉంటుందని, పోరాడి సమస్యలు సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బసవ లక్ష్మీ నర్సయ్య, జాతీయ కిసాన్ మోర్చా సభ్యులు గాలి మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులతో పాటు వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, రంగారెడ్డి జిల్లాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పర్యావరణాన్ని పరిరక్షించడం సామాజిక బాధ్యత : జిల్లా ప్రధాన న్యాయ మూర్తి



మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 12 (వేకువ సమయం ప్రతినిధి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని, ప్రకృతిని కాపాడుకోవాలనే ఉన్నత ఆశయంతో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరై, స్వయంగా కోర్టు సిబ్బందికి, ప్రజలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల జలవనరులు కలుషితమవుతూ పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాల ప్రకారం మట్టి విగ్రహాలను మాత్రమే పూజించి, రాబోయే తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతి మురారి, సీనియర్ సివిల్ జడ్జి షాలిని షాకెల్లితో పాటు కోర్టు ముఖ్య పరిపాలన అధికారి శ్రీనివాస్, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీమార్గమే రాజమార్గం లక్షేటిపేట జూనియర్ సివిల్ జడ్జి ఇంచార్జీ బి కృష్ణ తేజ

వేకువ సమయం, మంచిర్యాల//లక్షెట్టిపేట : రాజీమార్గమే రాజమార్గమని లక్షెట్టిపేట కోర్టు ఇంచార్జీ జూనియర్ సివిల్ జడ్జి బి కృష్ణ తేజ పేర్కొన్నారు. శనివారం లక్షెట్టిపేట కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. కక్షిదారులు చిన్నచిన్న కేసులలో ఇరుక్కుని పోలీస్ స్టేషన్ కోర్టుల చుట్టు తిరుగకుండా లోక్ అదాలత్ లో రాజీకి వచ్చినట్టయితే కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. చిన్న చిన్న కేసుల్లో ఇరుక్కున్న వారు ప్రతి ఒక్కరూ లోకాఆదాలతో ఆశ్రయించి కేసులలో రాజీ కావాలని సూచించారు. ఇలాంటి లోక్ అదాలత్ లు కచ్చి దారులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ లోకఅదాలత్ లు విజయవంతం కావడానికి సహక రించిన పోలీసులు మరియు కోర్టు సిబ్బంది న్యాయవాదులు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి బి. కృష్ణ తేజ, లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోవింద్ సీనియర్, ప్రధాన కార్యదర్శి, న్యాయవాదులు రాజేశ్వరరావు, భూమారెడ్డి, అక్కల శ్రీధర్, కారుకూరి సురేందర్, నలినీకాంత్,పద్మ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ ఎల్‌నినో.. సంసిద్ధత ఏదీ?!

సమయం ప్రతినిధి: రెండేళ్ల పాటు దేశాన్ని కరోనా మహమ్మారి అతలాకుతలం చేసిన క్లిష్ట సమయంలో దేశ ప్రజలకు ఆహార భద్రత అందించింది వ్యవసాయ రంగమే. ఆ సమయంలో దాదాపుగా అన్ని రంగాలు పడకేశాయి. కానీ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు దేశాన్ని ఆదుకున్నాయి. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటూ కూడా రైతాంగం ఏ ఒక్క ఏడాదీ వ్యవసాయాన్ని వదలకపోవడం వల్లనే అది సాధ్యపడింది. ప్రపంచంలోని అనేక దేశాలు.. చివరకు అగ్ర దేశాలు సైతం కరోనా సమయంలో తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొన్నాయి. కానీ, భారత్‌కు ఆ దుస్థితి ఎదురుకానందుకు రైతాంగానికి దేశ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారు. నేడు రైతాంగం కరోనాను మించిన కష్ట కాలాన్ని సూపర్ ఎల్‌నినో రూపంలో ఎదుర్కొంటున్నది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఫలితంగా... దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో దాదాపు 20కి పైగా ప్రాంతాల్లో సగటు సాగు 50శాతానికి మించలేదని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దేశవ్యాప్తంగా నిలకడలేని వాతావరణ పరిస్థితులు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో అసాధారణంగా 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో బలమైన వడగాలులు వీస్తున్నాయి. దీన్నిబట్టి చూస్తే దేశ వాతావరణం ఎంత అస్థిరంగా ఉందో అర్థం అవుతోంది.కరోనాలో కొంత ఆలస్యంగానైనా శాస్త్రజ్ఞుల కృషి వల్ల ప్రజల ప్రాణాలు నిలబెట్టగలిగిన వ్యాక్సినేషన్లు వచ్చాయి. ఆ సమయంలో కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ఉమ్మడి కార్యాచరణతో పనిచేయడం వల్ల ప్రజల్లో భరోసా ఏర్పడింది. నష్ట తీవ్రత తగ్గింది. కానీ ఇప్పుడు ఈ ఎల్‌నినో విపత్తును ఎదుర్కోవడానికి కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయడం లేదు. ఎల్‌నినో ప్రభావం మరింత ఎక్కువగా 2027 సంవత్సరం చివరి వరకూ కొనసాగుతుందని భారత వాతావరణశాఖ స్పష్టం చేసింది. కానీ ఆశ్చర్యకరంగా ఉమ్మడి జాబితాలో ఉన్న వ్యవసాయ రంగంలో ఏర్పడిన ఈ అసాధారణ పరిస్థితులను కలిసికట్టుగా ఎదుర్కోవడానికి దేశంలోని అన్ని రాష్ట్రాలతో కేంద్రం సమన్వయం చేసుకోవడం లేదు. కరోనా విపత్తు సమయంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో తరచుగా జూమ్ సమావేశాలు నిర్వహించి అందరి సలహాలు, సూచనలు స్వీకరించి వారికి దిశానిర్దేశం చేశారు. ఆ చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. కరోనాలో అదృష్టవశాత్తూ దేశంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తాత్కాలికంగానైనా రాజకీయాలను పక్కన పెట్టాయి. ఐక్యంగా ప్రజలను ఆదుకోవడానికి సిద్ధపడ్డాయి. ఇప్పుడు కూడా అటువంటి సుహృద్భావ వాతావరణం అత్యంత అవసరం. రైతాంగం కష్టాల్లో ఉన్నదంటే అర్థం దేశ ప్రజలందరూ ఇబ్బందుల్లో ఉన్నట్టే.

## రాంపల్లిదాయరలో అక్రమ కట్టడాలు కూల్చివేత.. కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు

వేకువ సమయం సెప్టెంబర్ 12 కీసర ప్రతినిధి : కీసర: ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. కీసర మండలం రాంపల్లిదాయర గ్రామంలోని సర్వే నంబర్ 45లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను శనివారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారంటూ స్థానికులు జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, కీసర తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రి-కాస్ట్ వాల్‌తో పాటు ఇతర నిర్మాణాలను తొలగించి స్థలాన్ని స్వాధీనంలోకి తీసుకున్నారు.

**ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం**

ప్రభుత్వ భూముల పరిరక్షణపై వస్తున్న ఫిర్యాదులను అధికారులు సీరియస్‌గా తీసుకోవడంతో ఈ చర్యకు ప్రాధాన్యత ఏర్పడింది. విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్రైవేటు ఆస్తులుగా మార్చే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఆక్రమణదారులకు హెచ్చరిక**

ప్రభుత్వ భూములను ఆక్రమించడం, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని కీసర మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నించినా, నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని



హెచ్చరించారు. ప్రభుత్వ భూములపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అధికారులు తీసుకున్న చర్యలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, మిగిలిన ప్రభుత్వ స్థలాలపైనా ప్రత్యేకంగా సర్వే నిర్వహించి ఆక్రమణలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

## ఎస్‌జీఎఫ్‌ఐ జోనల్ టోర్నమెంట్ ఘనంగా ముగింపు

వేకువ సమయం సెప్టెంబర్ 12 కీసర ప్రతినిధి : కీసర: ఆర్మీ స్పోర్ట్స్ అకాడమీ వేదికగా సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు నిర్వహించిన 70వ SGFI కీసర-కాప్రా జోనల్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. జోనల్ సెక్రటరీ అవుసుల మనోహర్ (పీడీ, జెడ్పీహెచ్‌ఎస్ రాంపల్లి) ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో విభాగాల్లో అండర్-14, అండర్-17 బాలబాలికలు కలిపి 4,944 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అదనంగా అండర్-14, అండర్-17 బాలుర క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహించారు.టోర్నమెంట్‌ను 126 మంది పీఈటీలు, కోచ్‌లు, అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. కబడ్డీలో అండర్-14 బాలుర విభాగంలో రవీస్ ఇంటర్నేషనల్ స్కూల్, బాలికల్లో ఎంజేపీటీడబ్ల్యూఎస్ ఘట్కేసర్ విజేతలుగా నిలిచాయి. అండర్-17లో బాలురు, బాలికల విభాగాల్లో సెరెనిటీ మోడల్ స్కూల్ కీసర సత్తా చాటింది. వాలీబాల్‌లో అండర్-14 బాలుర విభాగంలో టీజీఆర్‌ఎస్ కీసరగుట్ట, బాలికల్లో ఎంజేపీటీడబ్ల్యూఎస్ ఘట్కేసర్ విజేతలుగా నిలవగా, అండర్-17 బాలురలో ఎస్‌ఆర్ ప్రైమ్ స్కూల్, బాలికల్లో ఎంజేపీటీడబ్ల్యూఎస్ విజయం సాధించాయి. ఖో-ఖోలో అండర్-14 బాలురలో టీజీఆర్‌ఎస్ కీసరగుట్ట, బాలికల్లో ఎంజేపీటీడబ్ల్యూఎస్ ఘట్కేసర్, అండర్-17 బాలురలో టీజీఆర్‌ఎస్ కీసరగుట్ట, బాలికల్లో ఎంజేపీటీడబ్ల్యూఎస్ బోగారం విజేతలుగా



నిలిచాయి.ముగింపు కార్యక్రమంలో విజేతలు, రన్నర్స్‌కు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన క్రీడాకారులు, ఉపాధ్యాయులు, పీఈటీలు, కోచ్‌లు, అధికారులను నిర్వాహక కమిటీ అభినందించింది.

## జామున కార్డన్ అండ్ సెర్చ్

మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 12 (వేకువ సమయం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శభరీష్ ఐపీఎస్ అదేశాలు మేరకు మరిపెడ సీఐ, ఎల్ పవనకుమార్ ఆధ్వర్యంలో మరిపెడ సర్కిల్ పోలీస్ లు గుర్రప్ప తండా, లచ్చ తండా, తండా ధర్మారం గ్రామాల్లో తెల్లవారు జామున కార్డన్ అండ్ సెర్చ్ చేయడం జరిగింది అనుమానస్పదా ఇల్లు వాహనాలు చెక్ చేయడం జరిగి సరైన ధ్రువ పత్రాలు లేని 02 కార్లు, 02 బైక్ లు సీజ్ చేయడం జరిగింది. ఈ తనిఖీలో 500 లీటర్ల బెల్లంపానకం ధ్వసం చేయడంతో పాటు, 20 లీటర్ల నాటు సారా సీజ్ చేయడం జరిగి బాధ్యులపై కేసు లు నమోదు చేయడం జరుగుతుంది. తనిఖీల అనంతరం గ్రామస్తులకు రోడ్ ప్రమాదాలు, సైబర్ నేరాలు మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలు పై అవగహన కల్పించడం జరిగింది. ఈ తనిఖీలో మరిపెడ ఎస్సై, గంద్రాతి సతీష్, ఎస్సై , మైబూబీ, సీరోల్ ఎస్ ఐ, సంతోష్, చిన్న గూడూరు ఎస్ ఐ, కుశకుమార్, ఎస్ ఐ, ప్రభాకర్ రెడ్డి తో పాటు 40 మంది సిబ్బంది పాల్గొన్నారు.







# గర్భస్రావాలకు అడ్డుకట్ట

**వేర్వేరు త్రైమాసికాల్లో జరిగే గర్భస్రావాలకు వేర్వేరు కారణాలుంటాయి. ఆరోగ్య సమస్యలు, జన్యు సమస్యలు మొదలు గర్భాశయ నిర్మాణంలో లోపాల వరకూ అనేక కారణాలు గర్భస్రావాలకు దారి తీస్తాయి. కాబట్టి కారణాన్ని కనిపెట్టి తదనుగుణమైన చికిత్సలను ఆశ్రయించాలంటున్నారు వైద్యులుగర్భధారణను మూడు త్రైమాసికాల్లో విభజిస్తే, మొదటి త్రైమాసికంలోనే గర్భస్రావ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.**

సమయం ప్రతినిధి

**మొదటి త్రైమాసికం:** గర్భం దాల్చిన మొదటి మూడు నెలల్లో జరిగే గర్భస్రావాలకు క్రోమోజోమ్స్‌లో లోపాలు ప్రధాన కారణం. అండం, వీర్యం ఆరోగ్యంగానే ఉన్నప్పటికీ, అవి రెండూ కలిసి పిండం తయారైనప్పుడు, దాన్లో క్రోమోజోమల్ మల్టిప్లికేషన్ సక్రమంగా జరగని సందర్భాల్లో, లోపాలతో కూడిన పిండం ఏర్పడుతుంది. ఈ పిండానికి పెరిగే స్వభావం ఉండదు కాబట్టి దానంతట అదే గర్భస్రావం ద్వారా బయటకు వచ్చేస్తుంది. భార్యాభర్తల కుటుంబాల్లో క్రోమోజోమ్ సంబంధిత సమస్యలున్నప్పుడు కూడా గర్భాశయంలో అసాధారణ పిండాలు ఏర్పడి, గర్భస్రావానికి దారి తీస్తాయి

**రెండో త్రైమాసికం:** మూడో నెల దాటిన తర్వాత గర్భస్రావానికి ప్రధాన కారణం... 'సర్వైకల్ ఇన్‌కాంపిటెన్స్'. ప్రసవ సమయంలో తెరుచుకుని, మూసుకుపోవలసిన గర్భసంచి ద్వారమైన సర్విక్స్, కొందరికి వదులుగా ఉంటుంది. నెలలు నిండేకొద్దీ శరీరంలో చోటుచేసుకునే హార్మోన్ల మార్పుల వల్ల, పెరిగే బరువు వల్ల పిండం సర్విక్స్ గుండా బయటకొచ్చేస్తుంది. అలాగే కొందరికి గర్భసంచి నిర్మాణంలో లోపాలుంటాయి. ఇలా పుట్టుకతోనే గర్భాశయ సమస్యలను వెంట తెచ్చుకున్న గర్భిణులు రెండో త్రైమాసికంలో గర్భస్రావ సమస్యను ఎదుర్కోవచ్చు. కొందరికి గర్భాశయ నిర్మాణ లోపాలతో పాటు, సర్వైకల్ ఇన్‌కాంపిటెన్స్ కూడా ఉండొచ్చు.

**మూడో త్రైమాసికం:** 24 వారాలు దాటిన తర్వాత జరిగే గర్భస్రావాన్ని ప్రి టర్మ్ లేబర్‌గా పరిగణించాలి. ఈ పరిస్థితి 25 వారాల నుంచి 35 వారాల్లోపు తలెత్తవచ్చు. సాధారణంగా గర్భంలో పెరిగే బిడ్డ 37 వారాలకు పూర్తి పరిణతి పొంది, 40 వారాలకు ప్రసవం ద్వారా బయటి ప్రపంచంలోకి అడుగు పెడుతుంది. కాబట్టి 37 వారాల్లోపు జరిగే ప్రసవాలన్నిటినీ ప్రి మెచ్యూర్‌గానే పరిగణించాలి. 34 నుంచి 37 వారాల్లోపు ప్రసవమైతే ప్రి మెచ్యూర్‌గా, 34 వారాల్లోపు జరిగే ప్రసవాన్ని వెరీ ప్రి మెచ్యూర్‌గా వైద్యులు పరిగణిస్తారు. గర్భాశయ నిర్మాణంలో లోపాలు, సర్విక్స్ వదులుగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణం. ఏడు, ఎనిమిది నెలల్లో జరిగే ప్రసవాలన్నీ ఈ కోవకు చెందినవే! అలాగే మధుమేహం ఉన్న మహిళలు, వెజైనల్ ఇన్‌ఫెక్షన్లు గర్భసంచికి వ్యాపించిన మహిళల్లో, ఉమ్మసంచిలోని మెంబ్రేన్స్‌కు ఇన్‌ఫెక్షన్ సోకి, అది త్వరగా బ్రేక్ అయిపోయి, ప్రసవమైపోతుంది.

### ప్రిమెచ్యూర్ లేబర్

అధిక బరువు, పిసిఒడి, మధుమేహ కుటుంబ చరిత్ర, కదలకుండా గంటల తరబడి పని చేయడం, అస్తవ్యస్థ జీవనశైలి, ఆహారశైలి వల్ల మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలు పెరుగుతున్నాయి. గర్భధారణ వయసు ఎంత ఆలస్యమైతే, మధుమేహం, అధిక రక్తపోటు ముప్పు అంత ఎక్కువగా ఉంటుంది. గర్భిణుల్లో 6 నుంచి 8 నెలల్లో మధుమేహం, అధిక రక్తపోటు పెరగడం, ఫలితంగా బిడ్డకు రక్తప్రసరణలో లోపం తలెత్తి, ఆక్సిజన్, పోషణ అందక కడుపులోనే బిడ్డ చనిపోయే అవకాశాలు ఉండడం వల్ల అంతకంటే ముందే వైద్యులు, గర్భిణులను ప్రి మెచ్యూర్ లేబర్‌కు గురి చేయక తప్పడం లేదు. ఇలాంటి సందర్భాల్లో గర్భిణి, బిడ్డ ఆరోగ్య పరిస్థితి ఆధారంగా సాధారణ ప్రసవం చేయవచ్చా, లేదంటే సర్జరీని ఆశ్రయించాలా? అన్నది వైద్యులు నిర్ణయిస్తారు. కొందరు గర్భిణుల్లో అధిక రక్తపోటు వల్ల మెదడులో నీరు చేరి, మూర్ఛలొచ్చే అవకాశాలుంటాయి. వైద్యులు, ముందస్తు లక్షణాల ద్వారా ఈ పరిస్థితిని అంచనా వేసి, వెంటనే సిజేరియన్ చేసేస్తూ ఉంటారు.

### ఆరోగ్యాన్ని గాడిలో పెట్టుకుని...

గర్భస్రావాలకు ఆస్కారం లేకుండా నెలలు నిండి పండంటి బిడ్డను ప్రసవించాలనుకునే ప్రతి మహిళా, గర్భధారణకు ముందే ఆరోగ్య సమస్యలను సరిదిద్దుకుని, పరిపూర్ణ ఆరోగ్యాన్ని సమకూర్చుకోవాలి. ప్రి డయాబెటిక్ దశలో ఉన్న మహిళలు, ఆ సమస్యను ఆహార నియమాలు, వ్యాయామంతో నియంత్రించుకుని, ఆ తర్వాత ప్రెగ్నెన్సీకి ప్రయత్నించడం ఉత్తమం. ప్రి డయాబెటి?సతో గర్భం దాల్చినప్పుడు, గర్భంతో పెరిగే హార్మోన్ల వల్ల ప్రి డయాబెటిస్, డయాబెటి?సగా మారిపోతుంది. కాబట్టి ముందే జాగ్రత్త పడాలి. మధుమేహానికి మందులున్నప్పటికీ, గర్భంతో ఉన్నప్పుడు మధుమేహాన్ని అదుపు చేయడానికి కొన్ని అడ్డంకులు ఎదురవుతాయి. బిడ్డకు పోషణ అందాలి కాబట్టి ఆహార నియమాలు సాధ్యపడవు. అన్ని మందులూ వాడుకునే వీలుండదు. కాబట్టి ముందు నుంచే ఆరోగ్యాన్ని గర్భధారణకు అనువుగా ఉంచుకోవాలి. విటమిన్ లోపాలు, ఇన్‌ఫెక్షన్లు ఇతరత్రా ఆరోగ్య సమస్యలన్నిటినీ సరిదిద్దుకోవాలి.

### నెల తప్పిన వెంటనే...

సాధారణంగా మూడో నెల వరకూ గర్భిణులు వైద్యులను కలవవలసిన అవసరం లేదనుకుంటారు. కానీ మొదటి ఐదు నెలలే అత్యంత కీలకం. కాబట్టి నెల తప్పిన వెంటనే వైద్యులను కలవడం అవసరం. ముందు ఎలాంటి పరీక్షలూ చేయించుకోని గర్భిణులకు వైద్యులు అవసరమైన పరీక్షలు సూచిస్తారు. ఆహార నియమాలతో పాటు వ్యాయామాలనూ సూచిస్తారు. గర్భధారణకు ముందే వ్యాయామాలు చేయడం ఎంతో అవసరం. దీంతో శరీర పటుత్వం పెరుగుతుంది. అలాగే గర్భం దాల్చిన తర్వాత మొదటి ఐదు నెలలూ ఎక్కువ బరువు పెరగకూడదు. ఇద్దరు మనుషులకు సరిపడా తినాలని ఎక్కువ తినడం వల్ల బరువు పెరిగితే, ఐదో నెలకే అధిక రక్తపోటు, మధుమేహం వచ్చేస్తాయి. కాబట్టి గర్భిణులు ప్రతి నెలా వైద్యులను కలుస్తూ, బరువును అదుపులో ఉంచుకుంటూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలి.

### ముందస్తు చికిత్సలతో...

గర్భస్రావాలకు కారణమైన ఫైబ్రాయిడ్స్‌ను సర్జరీతో తీయించుకోవాలి. గర్భాశయ నిర్మాణంలో లోపాలుంటే వాటిని సరిచేయించుకోవాలి. మూడో నెలలో సర్విక్స్ వదులుగా ఉందని తేలితే, కుట్టుతో సరిచేసుకోవచ్చు. క్రోమోజోమ్ సమస్యలను చికిత్సతో సరిదిద్దే వీలుండదు. కాబట్టి సహజసిద్ధంగా గర్భధారణ జరిగే వరకూ ఎదురుచూడక తప్పదు.

### అపోహలు - వాస్తవాలు

బొప్పాయి తింటే గర్భస్రావం అయిపోతుందన్నది అపోహ మాత్రమే! బొప్పాయి, పైనాపిల్ వల్ల గర్భిణులకు ఎలాంటి ముప్పు ఉండదు. పండిన బొప్పాయిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి కాబట్టి గర్భిణి ఈ పండును తినడం అవసరం. పచ్చి బొప్పాయిలో లేటెక్స్ అనే పదార్థం, గర్భాశయ సంకోచ వ్యాకోచాలను ప్రేరేపిస్తుంది. కాబట్టి బొప్పాయి గురించి ఒక అపోహ పాతుకుపోయింది. అయితే పండిన బొప్పాయిని గర్భిణులు నిస్సందేహంగా తినొచ్చు. పైనాపిల్ తినడం వల్ల, కొబ్బరినీళ్లు తాగడం వల్ల పుట్టబోయే పిల్లలకు వెంట్రుకలు పెరగవు అన్నది కూడా అపోహే! జన్యుపరమైన కారణాల వల్లే, పసికందులకు వెంట్రుకలు తక్కువగా ఉంటూ ఉంటాయి.

# వరకట్నపు హత్యలు ఇంకెన్నాళ్లు?




**సమయం ప్రతినిధి:** ఐక్యరాజ్యసమితి మహిళా విభాగంలో నేను పనిచేసిన కాలంలో స్త్రీ హత్య (ఫెమిసైడ్-స్త్రీలను, బాలికలను కేవలం జెండర్ కారణంతో చంపడం. 1970వ దశకంలో ఈ పదం ప్రాచుర్యం పొందింది) భావనకు గుర్తింపు సాధించేందుకు విశేష కృషి జరిగింది. ఆ కృషి 1994లో బెలెండో పారా ఒప్పందం (మహిళలపై హింసను మానవ హక్కుల ఉల్లంఘనగా గుర్తించిన ప్రప్రథమ అంతర్జాతీయ ఒడంబడిక)లోను ప్రతిబింబించింది. భారత్‌లో ఏ నేరాన్ని అయినా నిజంగా ఫెమిసైడ్ అని చెప్పాలంటే అది వరకట్న మరణమే అవుతుంది.వరకట్న సంబంధిత ప్రతి విషాదమూ జాతి అంతరాత్మను అమితంగా కలచివేస్తుంది. ఈ విషాదాలు వార్తల్లోకి వచ్చినా రాకపోయినా ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట సంభవిస్తూనే ఉన్నాయి. స్త్రీలను దేవీత్రయం-లక్ష్మి, సరస్వతి, పార్వతిగా పూజించే భారతదేశం స్త్రీల గౌరవాన్ని ఒక వినిమయ సరుకుగా ఎందుకు పరిగణిస్తోంది? స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి వికసిత భారత్‌గా ప్రభవించాలని ఆరాటపడుతున్న భారత్ తన కుమార్తెల విలువను వాహనాలు, నగదు, బంగారం, గృహాలతో నిర్ణయించడం క్షమార్హం కాని అవివేకం కాదా?వరకట్నం ఒక ఆచారం కాదు, ఒక కానుక కాదు, వివాహ మహోత్సవాలలో ఆడంబరపూర్వకంగా ప్రదర్శితమయ్యే 'కుటుంబ ప్రతిష్ఠ' కాదు. అదొక విపణి. వివాహం తన ఆత్మను కోల్పోతున్న సంత అది. వివాహ సమయంలో తల్లిదండ్రులు తమ కుమార్తెకు స్వచ్ఛందంగా ఇచ్చే భూమి, ఆభరణాలు, గృహోపకరణాలు మొదలైన వాటిని స్త్రీ ధనంగా పరిగణించడం మన సమాజంలో పురాతన కాలం నుంచీ వస్తోన్న సంప్రదాయం. మెట్టింటిలో తమ బిడ్డ ఆర్థిక భద్రతకు, గౌరవానికి, స్వతంత్ర ప్రతిపత్తికిగాను కన్నవారు ఆ ఆస్తులను ఇస్తారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఆ సిరి సంపదలపై కుమార్తే ఏకైక హక్కుదారు. భర్త కుటుంబాన్ని సంపద్వంతం చేసేందుకు కాక, మహిళా సాధికారతకు ఆలంబన అయ్యే సంప్రదాయమే స్త్రీ ధనం. ఆధునిక వరకట్నం అనేది స్త్రీ ధనం భావన వికృత రూపం. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడానికి రూపొందించిన ఒక సాధికారిక యంత్రాంగం నుంచి.. మహిళలను సరుకులుగా మార్చే, తరచుగా గృహహింసను ప్రేరేపించే ఒక బలవంతపు లావాదేవీల డిమాండ్‌గా ఇది రూపాంతరం చెందింది.వరకట్నం సాంఘిక దురాచారం మాత్రమే కాదు, అది పచ్చని సంసారంలో హింసకు తావిచ్చే ఒక అనాగరిక వ్యవహారం. డిమాండ్‌తో ప్రారంభమై హక్కుగా అది పరిణమిస్తుంది. ఈ క్రమంలో భౌతిక హింస చోటుచేసుకుని ఆత్మహత్య, హత్యకు పురిగొల్పుతుంది. కులమతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా కుటుంబ వ్యవస్థ అంతటా ఈ దురాచారం ప్రబలంగా ఉన్నది. 2024లో భారతదేశంలో 5,737 వరకట్న మరణాలు నమోదయ్యాయి. ప్రతిరోజూ ఇంచుమించు 16 మంది మహిళలు మరణం పాలయ్యారు. కేవలం 35శాతం కేసులలో మాత్రమే విచారణ పూర్తయి నిందితులకు శిక్షలు పడ్డాయి.వరకట్నం ఒక పురుషుడి గౌరవానికి భంగం కలిగించే వ్యవహారం. కట్నాన్ని డిమాండ్ చేసి తీసుకునే పురుషుడు తనకుతానుగా తన మార్కెట్ ధరను నిర్ణయిస్తున్నాడు. తన పురుషార్థాన్ని, పురుషత్వం-జీవన సామర్థ్యాలు, వ్యక్తిత్వం-విలువను తగ్గించుకుంటున్నాడు. విషాదమేమిటంటే వరకట్నం డిమాండ్లు అరుదుగా మాత్రమే బహిరంగంగా వ్యక్తమవుతాయి. సర్వసాధారణంగా అవి మర్యాదపూర్వకమైన సామాజిక భాషచాటున దాగి ఉంటాయి. నూతన వధూవరులు కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు సహాయపడడం, పెళ్లి ఖర్చులన్నీ వధువు కుటుంబం వారే భరించాలనడం మొదలైన కోరికలుగా అవి ఉండడం కద్దు. అమ్మాయికి ఇచ్చే ఆస్తుల గురించి తేలేదాకా వరుడి కుటుంబం ఆ సంబంధాన్ని ఒప్పుకుంటున్నదీ లేనిదీ చెప్పదు. యువతులు దీన్నొక ముందస్తు హెచ్చరికగా తీసుకోవాలి. విద్య, ఉద్యోగ హోదా కూడా చాలా ముఖ్యం. మానసిక సంసిద్ధత కూడా అంతకంటే ముఖ్యమైనది. వరకట్నం ఆశించే సంబంధం నుంచి వైదొలగడం అంటే నిశ్చితార్థం లేదా వివాహం రద్దు కావడం కాదు. అది ఆత్మరక్షణ. వధువుల వ్యక్తిగత సాధికారతకు అదొక కీలకమైన చర్య. వరకట్న విషాదాలను నివారించడంలో యువతుల తల్లిదండ్రులకు చాలా బాధ్యత ఉన్నది. తొలుత అసలు వరకట్నం ఇచ్చేందుకు అంగీకరించకూడదు. వివాహానంతరం వరకట్నాన్ని డిమాండ్ చేస్తే 'ఆ వివాహ బంధాన్ని ఎలాగైనా కాపాడాలి' అనీ, 'ఎట్టి పరిస్థితులలోను కూతురి కాపురాన్ని నిలబెట్టాలి' అని ఆలోచనలు చేయవలసిరావడం అనివార్యమవుతుంది. భర్తతో సర్దుకుపోవాలని, రాజీపడాలని లేదా కుటుంబ గౌరవాన్ని దృష్టిలో ఉంచుకోవాలని యువతులకు ప్రతి ఒక్కరూ సలహా ఇస్తుంటారు. హింసాత్మక వాతావరణం నెలకొన్న సంసారంలో గౌరవం లభిస్తుందా? కష్టాల్లో పడ్డ ఆడపడుచులకు తల్లిదండ్రుల గృహం ఒక రక్షణాశ్రయం కావాలేగానీ, ఒక న్యాయస్థానం కాకూడదు. వరకట్న వేధింపులలో అత్త, ఆడబిడ్డ, మహిళా బంధువుల పాత్ర సైతం క్రూరంగా ఉండడం కద్దు. ఒక మహిళ కష్టాలకు తోటి మహిళే కారణమవడం విచారకరం! మన సమాజంలో పితృస్వామ్య వ్యవస్థ సంప్రదాయాలు ఇంకా బలంగా వర్ధిల్లుతున్నాయంటే అందుకు కారణం పితృస్వామ్య అణచివేతలలో మహిళలు భాగస్వాములవడం కూడా అని చెప్పక తప్పదు. భారతదేశంలో వరకట్నాన్ని ఇవ్వడం, తీసుకోవడం నిషిద్ధం. 1961లోనే వరకట్న నిషేధ చట్టం అమలులోకి వచ్చింది. భారతీయ న్యాయసంహితలోని సెక్షన్ 80 వరకట్న మరణాలకు సంబంధించినది. అది నిందితులకు కఠిన శిక్షలు నిర్దేశించింది. క్రూరత్వం, వేధింపులు మొదలైన నేరాలపై విచారణ సెక్షన్ 85 కింద జరుగుతుంది. చట్టం పటిష్ఠంగా ఉన్నది. మరి అది సరైన రీతిలో అమలవుతున్నదా? చట్టాలను అమలుపరచనప్పుడు నేరాలను ఎలా నిరోధించగలుగుతాము? వరకట్న సంబంధిత కేసులలో చాలామంది నిందితులు నిర్దోషులుగా విడుదలవుతున్నంత మాత్రాన అవి తప్పుడు కేసులు కావు. విచారణలో జాప్యం, సామాజిక ఒత్తిడి, కోర్టు వెలుపల పరిష్కారాలు మొదలైన కారణాలతోనే చాలామంది నిర్దోషులుగా విడుదలవుతున్నారు.మరి వరకట్న నేరాలను అరికట్టడమెలా? వరకట్న ఆచారాన్ని నిరోధించడమే. యువతులకు సాధికారత కల్పించడం ద్వారా వరకట్నాన్ని వ్యతిరేకించేలా చేయాలి. సంబంధిత చట్ట నిబంధనలను కచ్చితంగా అమలుపరచాలి; సంరక్షణ చర్యలు ముఖ్యం. ఈ నేరాలు, ఘోరాలు జరిగినప్పుడు వెన్వెంటనే అధికార వ్యవస్థకు సమాచారమందించి, బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలి. బాధ్యతాయుతమైన పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలి. నమోదైన కేసులపై విచారణ సత్వరమే జరిగేలా చూడాలి. జరిగిన నేరానికి భర్త, అత్తమామలు, ఆడబిడ్డలు, ఇతర బంధువులను జవాబుదారీ చేయాలి. బాధితుల మానసిక ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలి. వరకట్న దురాచారాన్ని నిర్మూలించి తీరాలి. అది ధర్మ విరుద్ధమైనది, అనాగరికమైనది. మహిళ హుందాను ఉల్లంఘిస్తుంది. పురుషుడి గౌరవాన్ని తగ్గిస్తుంది. కుటుంబాన్ని అవినీతిపాలు చేస్తుంది. సమభాగస్వామ్యమైన వివాహవ్యవస్థను విషతుల్యం చేస్తుంది. బలవంతపు చర్యలను ఏ ఆచారమూ అంగీకరించదు. వరకట్నాన్ని తీసుకోవడం ఏ కుటుంబానికీ గౌరవనీయం కాదు. ఆర్థిక లావాదేవీతో ప్రారంభమయ్యే ఏ వివాహమూ పవిత్రమైనది కాజాలదు.




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, మలయాళ బ్యూటీ మమితా బైజు కాంబినేషన్‌లో తెరకెక్కిన కుటుంబ కథా చిత్రం విశ్వనాథ్ అండ్ సన్స్. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహించాడ. ఆగస్టు 14న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లను సాధించి సంచలన విజయం నమోదు చేసుకుంది. థియేట్రికల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ చిత్రం, సెప్టెంబర్ 11 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ లో ఐదు భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. కుటుంబ భావోద్వేగాలు, ప్రేమ, వినోదం మేళవింపుగా రూపొందిన ఈ చిత్ర కథ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోంది. థియేటర్లలో మిస్ అయిన సినీ ప్రియులు ఇప్పుడు ఓటీటీలో ఈ చిత్రాన్ని చూస్తూ విశేషంగా ఆదరిస్తున్నారు. అయితే ప్రస్తుతం సోషల్ మీడియా అంతటా ఈ సినిమాలో కథానాయికగా నటించిన మమితా బైజు ఎక్స్‌ప్రెషన్స్ పైనే తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. మ్యాడీ అనే ఎంతో క్యూట్ అండ్ బబ్లీ పాత్రలో ఆమె అద్భుతంగా ఒదిగిపోయిందని ప్రేక్షకులు కొనియాడుతున్నారు. సినిమాలో ఆమె ఇచ్చిన చిన్న చిన్న హావభావాలు, ముద్దు ముద్దుగా చేసే మేనరిజమ్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతి సన్నివేశంలోనూ ఆమె క్యూట్‌నెస్‌తో సీన్‌ను డామినేట్ చేసిందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. అంతేకాకుండా ఏం పిల్లరా బాబు.. పోవడం లేదు మైండ్ లో నుంచి అంటూ సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు కథానాయకుడిగా సూర్య కూడా తన నటనతో మరోసారి మెప్పించాడు. సంజయ్ విశ్వనాథ్ అనే పాత్రలో ఆయన చూపించిన పరిణతి, ఎమోషనల్ పండించిన తీరు సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. సూర్య–మమితా మధ్య వచ్చే కెమిస్ట్రీ, సన్నివేశాల్లో వారిద్దరి టైమింగ్ నెటిజన్లను కట్టిపడేస్తోంది. ఓటీటీలోనూ పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న ఈ చిత్రం రాబోయే రోజుల్లో డిజిటల్ వేదికపై మరిన్ని రికార్డులు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.




'కోర్ట్ -- స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' సినిమా విజయం తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న సినిమా 'అలియాస్ రుక్మిణీ'. నితిన్ హీరో నటిస్తున్న ఈ సినిమాను 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ డైరెక్ట్ చేస్తున్నారు. దీనికి ఆయనే రచయిత కూడా. నాని సోదరి దీప్తి గంట ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఆసక్తికరమైన కథతో ఓ విలక్షణమైన ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నట్టు మేకర్స్ తెలిపారు. తాజాగా ఈ సినిమా పది రోజుల మొదటి షెడ్యూల్ చిత్రీకరణను పూర్తి చేసుకుంది. చిత్ర బృందం ప్రధాన తారాగణంతో కూడిన కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించింది. ఈ షూట్‌లో హీరో నితిన్‌తో పాటు సాయి కుమార్, హర్ష వర్ధన్, ఇతర ప్రముఖ నటులు పాల్గొన్నారు. ఈ సినిమాను నాని ప్రెజెంటర్‌గా వ్యవహరిస్తున్నారు. దాంతో మూవీపై అంచనాలు మరింత పెరిగాయి. సినిమా ప్రారంభోత్సవం సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన లైట్ హార్ట్ హాస్యంతో కూడిన గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రానికి జోమోన్ టి. జాన్ ఐఎస్‌సి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా, విజయ్ బల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్ కాగా, సృజన అడుసుమిల్లి ఎడిటర్.




విక్టరీ వెంకటేష్ , మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ల్యాండ్‌మార్క్ చిత్రం ఆదర్శ కుటుంబం . హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తోండగా నివేతా పేతురాజ్, నారా రోహిత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ఫస్ట్ గ్లిమ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా టీజర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్ ఆద్యంతం నవ్వులు పూయిస్తుంది. చిట్టిబాబు ఒక మధ్యతరగతి వ్యక్తి. నిత్యం అప్పులు చేసే భార్య.. చదువురాని కొడుకు.. ఆ అప్పులను, కుటుంబాన్ని భరిస్తూ ఉద్యోగం చేసే చిట్టిబాబుకు అనుకోకుండా లాటరీ తగిలి ఒక్కసారిగా కోటీశ్వరుడుగా మారిపోతాడు. ఇక అక్కడకు వెళ్ళాక ఆ కుటుంబంలో వచ్చిన మార్పులు ఏంటి.. ? చిట్టిబాబుకు ఎదురైన సమస్యలు ఏంటి.. ? అనేది సినిమా కథగా తెలుస్తోంది. ఇక టీజర్ లో వెంకటేష్ చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 'నాకు ఫ్యామిలీ ఇమేజ్ ఉందని తెలుసు.. కానీ సిచ్యువేషన్ డిమాండ్ చేస్తే యాక్షన్ చేయడానికి వెనుకాడను', 'నదికట్టు దాటితే వరదంటారు.. సముద్రం దాటితే ఉప్పెనంటారు.. కానీ సామాన్యుడు హద్దు దాటితే బలమైన పదం.. స్ట్రాంగ్ సౌండ్ వస్తుంది' అనే డైలాగ్స్ గురూజీ పంచ్ డైలాగ్స్ ని గుర్తుచేస్తున్నాయి. వెంకటేష్ కామెడీ టైమింగ్, సరికొత్త యాక్షన్ మేకోవర్‌తో పాటు తమన్ ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. టీజర్ లో గురూజీ మార్క్ కనిపించింది అని చెప్పొచ్చు. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు పవర్ ప్యాక్డ్ యాక్షన్ ఎలిమెంట్స్ కలగలిపి తెరకెక్కించిన ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. మరి ఈ సినిమాతో వెంకీ- త్రివిక్రమ్ ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి.




నందమూరి హీరోస్ అందరికంటే భిన్నంగా బాలకృష్ణ నటవారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ ఉంటుందని టాక్. పలు ఫాంటసీ ఎలిమెంట్స్ తో మోక్షజ్ఞ ఫస్ట్ మూవీ తెరకెక్కనుందని వినిపిస్తోంది. అదే సమయంలో నందమూరి హీరోలకు ఉన్న ఓ సెంటిమెంట్‌ను మోక్షజ్ఞ బ్రేక్ చేస్తాడని అభిమానులు నమ్ముతున్నారు. బాలకృష్ణ నటవారసునిగా మోక్షజ్ఞను తెరపై చూడాలని అభిమానులు కొన్ని దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. అదుగో ఇదుగో అంటూనే కాలం కరిగిపోయింది. మొత్తానికి మోక్షజజ సినిమా ఈ యేడాది సెట్స్ కు వెళ్తుందని వినిపిస్తోంది. నందమూరి హీరో కళ్యాణ్ రామ్ నటించి, నిర్మించిన 'బింబిసార' ద్వారా దర్శకునిగా పరిచయమైన వశిష్ఠ దర్శకత్వంలోనే మోక్షజజ సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. నందమూరి హీరోల ఎంట్రీ సమయంలో పెద్దగా హంగామా ఏమీ ఉండదు. వారి సినిమాలు సాదాసీదాగానే ఆరంభమవుతాయి. తరువాతే థియేటర్లలో సందడి చేస్తాయని ఇప్పటికే ప్రూవ్ అయింది. ఒకే ఒక్క నందమూరి తారకరత్న విషయంలోనే అందుకు భిన్నంగా సాగింది. ఒకే రోజున తారకరత్న నటించిన తొమ్మిది చిత్రాలు ప్రారంభమయ్యాయి. అయితే బాలయ్య తనయుడు మోక్షజజ విషయంలో అంతటి హంగామా ఏమీ లేకుండా సినిమా మొదలవుతుందని వినిపిస్తోంది.

## Cinema




హీరో సుమంత్ నటించిన డివైన్ థ్రిల్లర్ మూవీ 'మహేంద్రగిరి వారాహి'. స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ ప్రత్యేక పాత్రలో నటించిన ఈ సినిమాను సంతోష్ జాగర్లపూడి తెరకెక్కించారు. లక్ష్మణ్, కలిపు మధు దీనిని ప్రొడ్యూస్ చేశారు. సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రానికి చక్కని స్పందన లభిస్తోందని చిత్ర బృందం తెలిపింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో హీరో సుమంత్ మాట్లాడుతూ, 'చాలా కాలంగా కొంతమంది ఇండస్ట్రీ పీపుల్, అలాగే నా ఫ్యాన్స్ నుంచి విషెస్ అందుకోలేదు. నిన్నటి నుంచి ఆ అభినందనలు మొదలయ్యాయి. 'మహేంద్రగిరి వారాహి'ని గురించి ప్రేక్షకులు, అభిమానులు చాలా గొప్పగా మాట్లాడుతున్నారు. ముఖ్యంగా కృష్ణా జిల్లా నుంచి చాలా మంచి కాల్స్ వస్తున్నాయి. గ్రౌండ్ లెవెల్‌లో టాక్ చాలా పాజిటివ్‌గా ఉంది. పికప్ కావడానికి టైం పట్టింది, అది వాస్తవమే. ఇప్పుడు మంచి టాక్ సెటిల్ అయింది. ఈ టాక్ మరింత పెరుగుతుంది. చాలాకాలం తర్వాత నా స్నేహితులు, శ్రేయోభిలాషుల నుంచి కంగ్రాచ్యులేషన్స్ అందుకున్నాను. చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకి చాలా మంచి ఫ్యూచర్ ఉంటుంది. మాకు సపోర్ట్ చేసిన మీడియాకి, ప్రేక్షకులకు థాంక్యూ. తప్పకుండా ఈ వీకెండ్ సినిమా చూడండి. మేము చాలా మంచి సినిమా చేశాం. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. డైరెక్టర్ సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ,'సినిమా చూసిన ప్రతి ఒక్కరి దగ్గర నుంచి చాలా పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులకు ఎలా కనెక్ట్ అవుతుందో అనే ఒక చిన్న భయం ఉండేది. ఆడియన్స్ వాటిని చాలా ఎంజాయ్ చేశారు. ప్రతి షోకి ఫుట్‌ఫాల్స్ పెరుగుతున్నాయి. అలాగే షోస్ కూడా పెరుగుతున్నాయి. రిలీజ్ అయిన అన్ని సినిమాల్లో మాది నంబర్ వన్‌లో ఉందని ఆడియన్స్ చెప్తున్నారు. చాలా హ్యాపీగా ఉంది. ప్రేక్షకుల పబ్లిక్ టాక్ రాపిడ్ ఫైర్‌లా వెళ్తుంది. ఇంకా అద్భుతంగా వెళ్లాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. నటుడు వంశీ చాగంటి మాట్లాడుతూ, 'సినిమా చూసిన అందరూ కూడా చాలా బాగుందని అంటున్నారు. ఒక మంచి సినిమా చూసామనే ఫీలింగ్‌తో వెళ్తున్నారు. చాలా ఎంజాయ్ చేస్తున్నారు. సినిమా ట్రెండింగ్‌లో ఉంది. ప్రతి షోకి సేల్స్ పెరుగుతున్నాయి. మీరందరూ తప్పకుండా ఈ పండగ సెలవుల్లో సినిమా చూడండి. అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. నటి మీనాక్షి గోస్వామి మాట్లాడుతూ, 'మీ అందరికీ సినిమా నచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. తప్పకుండా సినిమా అందరూ థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. నిర్మాత మధు మాట్లాడుతూ, 'ఇది మెల్లగా పికప్ అవుతుందని ముందే ఊహించాను. మేము ఊహించినట్టే ప్రతి షోకి సేల్స్ పెరుగుతున్నాయి. నిన్న రాత్రి కృష్ణా, ఈస్ట్, వైజాగ్, తిరుపతి, నైజాం అన్నిచోట్ల ఫుల్స్ వచ్చాయి. ఇప్పుడు 75 స్క్రీన్స్ పెంచాం. అలాగే ఒడిశాలో కూడా చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. హిందీలో కూడా మెల్లగా పికప్ అవుతుంది. చాలా మంచి సినిమా చేశాం. తప్పకుండా ఆడియన్స్ అందరూ థియేటర్స్‌కి వెళ్లి చూడండి. ఒక మంచి సినిమా చూసిన అనుభూతి మీకు కలుగుతుంది' అని చెప్పారు.

మీ ప్రత్యేకతను,
మీ వ్యాపార అభివృద్ధికి
కొందరు మాత్రమే
నమ్మకమైన సేవలందిస్తారు..



మీ శ్రేయస్సును ఆకాంక్షించే వారికి
ఆత్మీయతను పంచండి

మధురస్మృతులు
ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి మరింత దగ్గరవ్వండి. మీ కుటుంబం సభ్యులలో, మీ బంధుమిత్రులలో, మీ ఆఫీసులో సహోద్యోగి ఎవరైనా రిటైర్ అవుతున్నా, వైవాహిక జీవితం 60 వసంతాలు పూర్తి చేసి వసంతోత్సవం జరుపుకుంటున్నా, ప్రశంసలు అందుకున్న ఆయా సందర్భాల్లో వారి జీవిత విశేషాలు మధురస్మృతులు తో పంచుకోండి. పలువురికి ఆదర్శప్రాయులు కండి.



మా కార్యాలయము :-
మధురస్మృతులు
మాస పత్రిక
SREEJA SREE PUBLICATIONS
H.No: 1-3-129, Rajendra Nagar,
Mahabubnagar. PIN - 509001.
Ph : 9848997085, 08542-222814
e-Mail : ms.mbnr2@gmail.com

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085